Follow: @ANNTELUGU
05-04-2025
ANN తెలుగు
# మహా పత్రిక
శనివారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 124 పేజీలు-08 వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



కేరళ సీఎం విజయన్‌కు
## కేంద్రం షాక్
ఆయన కుమార్తె వీణావిజయన్ పై విచారణకు గ్రీన్ సిగ్నల్
వీణా విజయన్ పై ఆర్థిక నేర అభియోగాలు
అక్రమంగా మైనింగ్ కంపెనీ నుండి ముడుపులు తీసుకున్నారన్న ఆరోపణలు

**మహా:** కేరళ సీఎం పినరయి విజయన్ కుమార్తె టీ వీణా విజయన్ చిక్కుల్లో పడ్డారు. ఆర్థిక నేరం కేసులో ఆమెను విచారించేందుకు కేంద్రం అనుమతి ఇచ్చింది. న్యాయ విచారణ చేపట్టేందుకు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఆదేశాలు జారీ చేసింది. మిగతా 2లో

టాప్ న్యూస్

మేకప్ మెన్‌లు, టేబుల్ తుడిచే
### వాళ్లకు టికెట్లా..?
- రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు
- గౌతంరావు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై తీవ్ర అసంతృప్తి
- కిషన్ రెడ్డి టార్గెట్ గా వ్యాఖ్యలు



02

బియ్యం రవాణా, పంపిణీని
### వేగవంతం చేయాలి
- రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలి
- సన్న బియ్యం పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్



03

గ్రూప్ 1 నియామకాలకు
### లైన్ క్లియర్
- జీవో నెం.29ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది
- కీలక తీర్పు ప్రకటించిన ధర్మస్థానం



02



దేశంలో రాష్ట్రంలో బీజేపీ
### పని అయిపోయినట్లే
- మూడోసారి గెలిచాక మోదీకి గర్వం బాగా పెరిగింది
- మోదీపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత
- వాడు వీడు భిక్ష వేస్తే సీఎం సీట్లో కూర్చోను
- వచ్చే ఎన్నికల్లో సొంతంగానే ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం
- హైదరాబాద్, రంగారెడ్డి నేతల సమావేశంలో కేసీఆర్ వ్యాఖ్యలు

వివరాలు 3లో



అలేఖ్య చిట్టి పికిల్స్..
### వేగంగా ఎదిగి.. నోటిదూలతో మటాష్
- ఒక్క ఆడియోతో యాపారం బంద్
- పచ్చడి కొనలేనివాడివి.. నీ పెళ్లానికి బంగారం ఏం కొనిస్తావ్ అంటూ ఆడియో వైరల్

వివరాలు 3లో



కంచె గచ్చిబౌలి గ్రీన్ లంగ్స్ ఏరియాలో..
# రాజీవ్ ఎకోపార్క్
## 400 ఎకరాలకు.. మరో వేయి ఎకరాలు అదనంగా సేకరణ
సీఎం రేవంత్ ముందుకు మంత్రుల కీలక ప్రతిపాదన
రాజీవ్ ఎకోపార్క్ ఏర్పాటుకు సానుకూలంగా సీఎం
పర్యావరణ వేత్తలు, ఇన్ ఫ్లూయర్స్ సూచనలు పరిగణనలోకి
యూనివర్శిటీ, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం



**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ ఊపిరితిత్తులుగా.. కంచె గచ్చిబౌలి ప్రాంతాన్ని పేర్కొంటూ ఇక్కడ పచ్చదనాన్ని పరిమళింపజేయాలన్న సూచనల నేపథ్యంలో కంచె గచ్చిబౌలి గ్రీన్ లంగ్స్ ఏరియాను ఊహించని రీతిలో పర్యావరణ హితంగా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోంది. ప్రభుత్వం ఐఎంజీ భారత్ తో కొట్లాడి సాధించిన 400 ఎకరాలతో పాటు మరో వేయి ఎకరాల యూనివర్శిటీ, ప్రభుత్వ భూములను కలిపి 1400 ఎకరాల్లో దేశంలోనే ఎక్కడా లేని విధంగా రాజీవ్ ఎకో పార్క్, బయో డైవర్సిటీ పార్క్ నిర్మించాలన్న ప్రతిపాదనను మంత్రులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందు ఉంచగా, ఆయన సానుకూలంగా స్పందించారు. మిగతా 2లో

విద్యావ్యవస్థను
# సంస్కరిస్తాం
మెరుగైన వ్యవస్థ కోసం సమగ్రవిధాన పత్రం
విద్యాకమిషన్ కు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు
యూనివర్శిటీలలో కాలం చెల్లిన కోర్సులు రద్దు చేయండి
యూనివర్శిటీల బాగుకు నిధులు కేటాయిస్తాం
విద్యారంగంపై ముఖ్యమంత్రి వరుస సమీక్షలు



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్రంలో మెరుగైన విద్యా వ్యవస్థ రూపకల్పనకు సమగ్ర విధాన పత్రం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విద్యా కమిషన్‌ను ఆదేశించారు. ఉత్తమ విద్యా వ్యవస్థ ఏర్పాటుకు ఎంత ఖర్చయినా ప్రభుత్వం వెనుకాడబోదని స్పష్టం చేశారు. మిగతా 3లో

యువత ఆశలు నిజం చేయడమే
# ప్రజా ప్రభుత్వ లక్ష్యం
స్వయం ఉపాధి పథకాలకు 9 వేల కోట్లు కేటాయించాం
59 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశాం
ఫ్యూచర్ సిటీ నిర్మాణం, ఐటీ సెక్టార్ విస్తరణతో లక్షల మంది ఉపాధి
ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ అభివృద్ధికి కృషి
వైటీపీఎస్ నిర్వాసితులహామీ నెరవేర్చాం..డిప్యూటీ సీఎం భట్టి



వివరాలు 2లో

## నిరుపేద ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే
సన్నబియ్యం సంతోషం చూసిన వేముల వీరేశం
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం పై లబ్దిదారుల ప్రశంసలు



**నకిరేకల్ :** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పంపిణీ చేసిన సన్నబియ్యం భోజనం ఎంతో సంతృప్తినిచ్చిందని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. సన్న బియ్యం తీసుకున్న నకిరేకల్ పట్టణానికి చెందిన లబ్ధిదారుడు వల్లాల సైదులు లక్ష్మమ్మ దంపతుల ఇంట్లో ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం భోజనం చేశారు. ఎంతో ఆనందంగా సన్న బియ్యంతో వండిన భోజనం వారు వడ్డించడం, అదే సమయంలో వారి కళ్లలోని ఆనందం చూస్తుంటే జీవితం ధన్యమైంది అని అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రతి నిరుపేద ఇంట్లో సన్నబియ్యం భోజనం ఉండాలనే లక్ష్యంతోనే పథకాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అదే విధంగా అర్హులందరికీ రేషన్ కార్డులు అందించి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వల్లాల సైదులు, లక్ష్మీ దంపతులు తమకు ఇల్లు లేదని ఎమ్మెల్యేకు విన్నవించగా వెంటనే మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు.




ఎమ్మెల్యే ఐడియా
# అదుర్స్
ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అంటున్న కవ్వంపల్లి
ప్రజల వద్దకే పాలన అంటే ఇదే కదా
ఏప్రిల్ 14న ప్రారంభం

**మహా:** ఎన్నికల తర్వాత ఓట్లు వేయించుకున్న నాయకులు తమను పట్టించుకోవడం లేదంటూ ప్రజలు తిట్టుకుంటారు. కలిసి తమ సమస్యను విన్నవించుకుందాం అనుకున్నా కలవడం లేదని వాపోతుంటారు. అలా తన నియోజకవర్గ ప్రజలు ఇబ్బందులు పడకూడదు అనుకున్నారు ఆ ఎమ్మెల్యే. కొత్తగా 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' అంటూ ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కొత్త రూట్‌ను కనుగొన్నారు. మిగతా 2లో


హైదరాబాద్ ఎమ్మెల్సీ
## ఎంఐఎం వర్సెస్ బీజేపీ
ఎంఐఎం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ మీర్జా రియాజ్
బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు
ఏకగ్రీవం కాకుండా బీజేపీ ఎత్తుగడ.. పోటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ దూరం
ఎంఐఎం గెలుపు లాంఛనమే.. 23న ఎన్నిక



వివరాలు 2లో

బట్టబయలైన కాంగ్రెస్, బీఆర్ఎస్
## ఫెవికాల్ బంధం
- మొన్న డీలిమిటేషన్ పేరుతో ఒక్కటయ్యారు
- నిన్న వక్ఫ్ బోర్డు బిల్లుపై కాంగ్రెస్ తో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా ఓటేశారు
- ఈరోజు మజ్లిస్ ను గెలిపించేందుకు రెండు పార్టీలు పోటీకి దూరమయ్యాయి
- కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?
- కేంద్ర మంత్రి బండి సంజయ్

02





## వక్ఫ్ సహా 16 బిల్లులకు ఆమోదం
పార్లమెంట్ నిరవధిక వాయిదా

03

## యువత ఆశలు నిజం చేయడమే
# ప్రజా ప్రభుత్వ లక్ష్యం

స్వయం ఉపాధి పథకాలకు 9 వేల కోట్లు కేటాయించాం

59 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశాం

ఫ్యూచర్ సిటీ నిర్మాణం, ఐటీ సెక్టార్ విస్తరణతో లక్షల మంది ఉపాధి

ప్రపంచంతో పోటీపడే విధంగా తెలంగాణ అభివృద్ధికి కృషి

వైటీపీఎస్ నిర్వాసితులహామీ నెరవేర్చాం: డిప్యూటీ సీఎం భట్టి



**మహా :** నిరుద్యోగ యువతీ యువకుల ఆశలు నిజం చేయడానికి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. హైదరాబాద్ సైబర్ గార్డెన్ లో శుక్రవారం నల్గొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం గ్రామం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ భూ నిర్వాసితుల కోటాలో ఉద్యోగాలు పొందిన జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ప్లాంట్ అటెండెన్స్, ఆఫీస్ సబ్ ఆర్డినేట్, హౌస్ కీపర్స్ తో పాటు టీజీపీఎస్సీ ద్వారా ఆర్థిక శాఖలో నూతనంగా నియామకమైన డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్స్ కు నియామక పత్రాలను ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అందజేశారు. ప్రత్యేక రాష్ట్రం వస్తే మా అందరికీ ఉద్యోగాలు వస్తాయని యువత భావించిందని, ఆత్మ గౌరవంతో బతకడానికి ఒక ఉపాధి దొరుకుతుందని దశాబ్దాల పాటు పోరాటం చేసిన నిరుద్యోగ యువతీ యువకులందరికీ ఈ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. రాష్ట్ర ఆవిర్భావం కోసం ఆశించి పోరాడిన యువతకు ఉద్యోగాలు కల్పించడం వల్లనే తెచ్చుకున్న రాష్ట్రానికి అర్థం, పరమార్థం ఉంటుందన్న ఆలోచనతో ప్రజా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 59 వేల మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ నియామక పత్రాలు అందించి ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించిందన్నారు. ఉద్యోగ అవకాశాలు పొందలేని నిరుద్యోగ యువతీ యువకుల కోసం 9 వేల కోట్ల రూపాయలతో స్వయం ఉపాధి పథకాలు అందించడానికి రాజీవ్ యువ వికాస పథకాన్ని ప్రారంభించామన్నారు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటి వరకు ఒకే సంవత్సరం స్వయం ఉపాధి పథకాల కోసం 9 వేల కోట్ల రూపాయలు కేటాయించడం చరిత్రలో లేదన్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ప్రకటన చేయడం, వదిలేయడం లాంటి పని చేయకుండా రాజీవ్ యువ వికాస పథకం ప్రకటనకు ముందే దరఖాస్తుల ప్రక్రియ, లబ్ధిదారుల ఎంపిక, సాంక్షన్, గ్రౌండింగ్ చేసేంత వరకు క్యాలెండర్ ఫిక్స్ చేసి ముందుగానే ప్రకటించామన్నారు. లక్షల మంది యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉపాధి కల్పించడానికి హైదరాబాద్ నగరంలో ఐటీ సెక్టర్, నాలెడ్జ్ వ్యవస్థలను ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని తెలిపారు. నాడు కొండలు గుట్టలు ఖాళీ ప్రదేశాలుగా ఉన్న హైటెక్ సిటీ ప్రాంతంలో ఐటి సెక్టార్ నెలకొల్పడానికి ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి వేసిన పునాదులు, ఆ తర్వాత వచ్చిన ముఖ్యమంత్రులు కూడా ఐటి సెక్టార్ ను అభివృద్ధి చేయడంతో ఈరోజు హైదరాబాద్ గ్లోబల్ సిటీగా మారడం వల్ల ప్రపంచంలో పేరు ప్రఖ్యాతులు ఉన్న సంస్థలు ఇక్కడికి వచ్చి కంపెనీలు పెట్టడం వల్ల లక్షలాది మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు లభించాయని వివరించారు. ప్రపంచంలో పేరు ప్రఖ్యాతి పొందిన సంస్థలను తీసుకొచ్చి హైదరాబాద్ నగరాన్ని విస్తరించడంతో పాటు లక్షల మంది యువతకు ఉపాధి కల్పించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దావోస్ కు వెళ్లి లక్ష 84 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఎంవోయూ చేసుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్యన చేయాల్సిన అభివృద్ధి పట్ల ప్రణాళిక బద్ధంగా ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని తెలిపారు. ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రగతి నిరోధకులు చేస్తున్న కుట్రల పట్ల అప్రమత్తంగా ఉంటూ నిరుద్యోగ యువతీ యువకులు అభివృద్ధి వైపు ముందుకు వెళ్లాలన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసిన యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ లో ప్రొడక్షన్ అందుబాటులోకి తీసుకురావడానికి అధికారంలోకి రాగానే ఎన్విరాన్మెంటల్ క్లియరెన్స్ కు ప్రజాభిప్రాయ సేకరణ చేయించి, అనుమతులు తీసుకొచ్చి పనులు మొదలుపెట్టి పూర్తి చేశామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అర్హత కలిగిన 112 మందికి యాదాద్రి పవర్ ప్లాంట్ లో ఉద్యోగ నియామక పత్రాలు అందజేసి 35 సంవత్సరాల పాటు ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించామన్నారు.

# బియ్యం రవాణా, పంపిణీని వేగవంతం చేయాలి

**రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలి**

పేదలతో కలిసి ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు భోజనం చేయాలి

సన్న బియ్యం పంపిణీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్

**మహా :** రేషన్ దుకాణాలకు సన్న బియ్యం రవాణా, పంపిణీని వేగవంతం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. శుక్రవారం సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి మంత్రి సన్న బియ్యం సరఫరాపై అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా దొడ్డు బియ్యం తినడం ఆపేశారని, దీన్ని గమనించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యాన్ని 84 శాతం జనాభాకు ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టామన్నారు. సన్న బియ్యం సరఫరా పంపిణీ విజయవంతం అవుతుందని, 84 శాతం జనాభా ఆహార భద్రతకు సుస్థిరత ఏర్పడిందన్నారు. రేషన్ దుకాణాలకు సన్న బియ్యం సరఫరా రవాణాను వేగవంతం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. రవాణా కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించి, సన్న బియ్యం రవాణాపై కలెక్టర్ లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా స్థాయిలో కూడా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు పేదలతో కలిసి ప్రభుత్వం సరఫరా చేస్తోన్న సన్న బియ్యంతో భోజనం చేయాలని మంత్రి సూచించారు. 13 వేల కోట్లు ఖర్చు చేసి, 30 లక్షల మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ఆహార భద్రత కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ఈ మేరకు ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలన్నారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా ప్రారంభించామని, దీనికి కృషి చేసిన అధికారులకు, సిబ్బందికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. సన్న బియ్యం పంపిణీ కారణంగా రేషన్ దుకాణాల వద్ద ఒకేసారి డిమాండ్ పెరిగిపోతున్నందున బియ్యం రవాణాను వేగవంతం చేయాలని, రేషన్ దుకాణాల వద్ద అవసరమైన మేర బియ్యం అందుబాటులో ఉండాలని సూచించారు. సంచుల కొరత ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సన్న బియ్యం పంపిణీపై ప్రభుత్వ చిత్తశుద్ధి చాటేలా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. నూతన ఆహార భద్రత కార్డుల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, సివిల్ సప్లై మేనేజర్ శ్రీనివాస్, అసిస్టెంట్ సివిల్ సప్లై అధికారి రోజా రాణి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్యే ఐడియా
# అదుర్స్

(మొదటిపేజీ తరువాయి)

అసలు ఆ ఎమ్మెల్యే ఎవరు? ఏం చేశారో ఇప్పుడు చూద్దాం.

**ప్రజలతో మమేకం కోసమే**

ప్రజలు తన వద్దకు వచ్చి ఇబ్బందులు పడకూడదని, తానే ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు పరిష్కరించాలని కరీంనగర్ జిల్లా మానుకొండూర్ ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ నిర్ణయించుకున్నారు. అందుకు 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' పేరుతో సుమారు రూ.25 లక్షల సొంత ఖర్చుతో మొబైల్ వాహనాన్ని, ఆండ్రాయిడ్ మొబైల్ యాప్‌ను సిద్ధం చేశారు. ఆ వాహనంలో వారానికి 3 రోజులు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో అధికారులతో సహా ఎమ్మెల్యే పర్యటిస్తూ ప్రజల నుంచి వినతులు తీసుకోనున్నారు. యాప్‌ను, వాహనాన్ని ఈ నెల 14న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

## హైదరాబాద్ ఎమ్మెల్సీ
# ఎంఐఎం వర్సెస్ బీజేపీ

ఎంఐఎం అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్సీ మీర్జా రియాజ్.. బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావు

ఏకగ్రీవం కాకుండా బిజెపి ఎత్తుగడ.. పోటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ దూరం

ఎంఐఎం గెలుపు లాంఛనమే.. 23న ఎన్నిక

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ ఎమ్మెల్సీ ఏకగ్రీవమవుతుందన్న అంచనాల నేపథ్యంలో.. అనూహ్యంగా బిజెపి రేసులోకి వచ్చి ఉత్కంఠ పెంచింది. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంఐఎం అభ్యర్థిగా మీర్జా రియాజ్ ఉల్ అసన్ పోటీ చేయనున్నారు.. ఆ పార్టీ ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయగా, నామినేషన్ దాఖలు చేశారు. గతంలో 2009లో నూర్ ఖాన్ బజార్, 2016 లో డబీర్ పురా కార్పొరేటర్ గా గెలుపొందిన మీర్జా రియాజ్. 2019 లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా ఎంఐఎం అవకాశం అవకాశం ఇచ్చింది.. 2023 లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా పదవి కాలం పూర్తైంది.. ఎంఐఎం తిరిగి హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చింది.

**ఎన్నికలకు కాంగ్రెస్,బిఆర్ఎస్ దూరం**

కాగా.. ఇప్పటికే బీజేపీ అభ్యర్థిగా గౌతమ్ రావుని పార్టీ ప్రకటించింది. ఇప్పటి వరకు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పోటీలో ఉండబోమని ఇప్పటికే కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు పేర్కొన్నాయి. ఇప్పటివరకు దాఖలైన ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకుంటే.. ఎంఐఎం, బీజేపీ మధ్య పోటీ ఉంటుంది. హైదరాబాద్ జిల్లా పరిధిలోని కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఎన్నికల్లో పాల్గొంటారు. హైదరాబాద్ లో కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి 110 మంది ఓటర్లు ఉన్నారు.. 81 మంది కార్పొరేటర్లు, 29 మంది ఎక్స్ అఫిషియో సభ్యులు ఉన్నారు. ఎక్స్ అఫిషియో సభ్యుల్లో 6 మంది ఎంపీలు, 8 మంది ఎమ్మెల్సీలు, 15 మంది ఎమ్మెల్యేలు ఉంటారు. ఎంఐఎం నుంచి 1 ఎంపీ, 7 ఎమ్మెల్యేలు, 1ఎమ్మెల్సీలు, 40 కార్పొరేటర్లతో కలిపి 49 మంది ఓటర్లు ఉన్నారు.. కాంగ్రెస్ నుంచి 1 ఎంపీ, 4 ఎమ్మెల్సీలు, 2 ఎమ్మెల్యేలు, 7 కార్పొరేటర్లతో కలిపి 14 ఓటర్లు, బీఆర్ఎస్ నుంచి 25 మంది ఓటర్లు, బీజేపీ నుంచి 22 ఓటర్లు ఉన్నారు.



# మేకప్ మెన్‌లు, టేబుల్ తుడిచే వాళ్లకు టికెట్లా..?

**రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**

**గౌతంరావు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వంపై తీవ్ర అసంతృప్తి.. కిషన్ రెడ్డి టార్గెట్ గా వ్యాఖ్యలు**

**మహా :** ఎప్పుడూ ఏదో ఒక అంశంపై స్పందిస్తూ వార్తల్లో నిత్యం నిలిచే బీజేపీ సీనియర్ నేత, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా గౌతం రావును బీజేపీ ఎంపిక చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. పార్టీ నిర్ణయంపై రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. "మేకప్ మెన్‌లు, టేబుల్ తుడిచే వాళ్లకు టికెట్లు ఇస్తున్నారు. పార్టీకి నిజమైన పని చేసిన వారిని విస్మరిస్తున్నారు. పార్టీకి మగాళ్లు దొరకలేదా?" అని పరోక్షంగా గౌతం రావును ఉద్దేశిస్తూ రాజాసింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. గతంలో మాధవిలతను హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించినప్పుడూ రాజాసింగ్ అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీలో ఎంత ముఖ్య నాయకుడైతే మాత్రం సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన వారికే అవకాశం ఇస్తారా..? అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మిగతా పార్లమెంట్ల పరిధిలో బీజేపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు ఇంకెవరూ కంటికి కనిపించలేదా అని ఫైర్ అయ్యారు. మీకు గులాంగిరీ చేసేటోళ్లకే పోస్టులు, టికెట్లను పంచిపెడతారా అంటూ రాజాసింగ్ తీవ్రం అసహనం వ్యక్తం చేశారు. రాజాసింగ్ వ్యాఖ్యలు బీజేపీ శ్రేణుల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ఈ పరిణామాలతో బీజేపీలో నాయకుల మధ్య విభేదాలు మరింత పెరిగే అవకాశమునట్లు పార్టీ గుసగుసలాడుతోంది. ఈ ప్రభావం రానున్న ఎన్నికలపైనా పడే ప్రమాదం ఉన్నట్లు తెలుస్తోంది.





## గ్రూప్ 1 నియామకాలకు
# లైన్ క్లియర్

- **జీవో నెం.29ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది**
- **కీలక తీర్పు ప్రకటించిన ధర్మస్థానం**

**మహా :** తెలంగాణ గ్రూప్1 అభ్యర్థులకు గుడ్ న్యూస్. ఉద్యోగ నియామకాలకు లైన్ క్లియర్ అయింది. జీవో నెం.29ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేపట్టేందుకు టీజీపీఎస్సీ సన్నాహకాలు మొదలు పెట్టింది. మొత్తం 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీ కోసం 2024 ఫిబ్రవరిలో టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. జూన్, 2024లో ప్రిలిమినరీ పరీక్ష జరగగా అక్టోబర్ లో మెయిన్స్ పరీక్షలు నిర్వహించారు. ఫలితాలు 2024, మార్చి 10న ప్రకటించారు. మార్చి 30న జనరల్ ర్యాంక్స్ విడుదల చేశారు. కానీ ఈ నోటిఫికేషన్ లో జీవో నెం. 29 ద్వారా తమకు అన్యాయం జరుగుతోందని కొంతమంది అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు వారి పిటిషన్‌ను కొట్టివేసింది. బలమైన వాదనలు లేవని తోచిపుచ్చింది.

## కంచె గచ్చిబౌలి గ్రీన్ లంగ్స్ ఏరియాలో..
# రాజీవ్ ఎకోపార్క్



(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర భవిష్యత్తు కోసమే 30 వేల కోట్ల సంపద పరుల పాలు కాకుండా కాపాడామని, ప్రజల అభీష్టం ప్రకారమే ప్రభుత్వం వ్యవహరిస్తుందని.. ఇది ప్రజా ప్రభుత్వమని సీఎం ఈ సందర్భంగా వ్యాఖ్యానించినట్లు తెలిసింది. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత కంచె గచ్చిబౌలి భూముల వ్యవహారంలో బయో డైవర్శిటీ పార్క్ నిర్మాణం, ఇతరత్రా పనులు చేపట్టాలని సర్కారు భావిస్తోంది. అంతర్జాతీయ స్థాయి అర్కిటెక్ట్ లతో రాజీవ్ ఎకో పార్క్ నిర్మాణం నమూనాలు గీయించే అవకాశాలున్నాయి. ప్రభుత్వం ఏ కార్యక్రమం చేపట్టినా, బురద జల్లడం బీఆర్ఎస్, వైసీపీ, బిజెపి సోషల్ మీడియాలకు రివాజుగా మారిందని, ఇది రాష్ట్ర ప్రగతికి అవరోధంగా మారుతుందని ప్రభుత్వంలోని కీలకనేతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం 400 ఎకరాల భూమిని సాధించడం కంటే, ఆ భూములను వేలం వేయాలనుకోవడం దేశవ్యాప్తంగా పెద్ద సంచలనంగా మారడంతో.. ఆందోళనలకు తోడు, ఎఐ చిత్రాలు, ఇతర ప్రాంతాల వీడియోలు కూడా ఫ్లోలో చుట్టుముట్టి బురదజల్లాయి. ఈ క్రమంలో జాతీయపార్టీకి, నాయకత్వానికి ఇబ్బందులు రాకుండా వెనక్కు తగ్గాలని.. ఈ భూములను హైదరాబాద్ పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని సర్కారు భావిస్తోంది. యూనివర్శిటీ చుట్టూ అన్యాక్రాంతమైన ప్రభుత్వభూములను కూడా బయటకు తీసి మైహోం విహంగ లాంటి ఆరోపణలున్న వెంచర్లపై కఠినంగా వ్యవహరించాలన్న యోచనలో సర్కారు ఉన్నట్లు తెలుస్తోంది.

## సర్కారు యోచనపై పర్యావరణ వేత్తల హర్షం

1400 ఎకరాల్లో రాజీవ్ ఎకోపార్క్ నిర్మించాలన్న ప్రతిపాదనపై పర్యావరణవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సుప్రీంకోర్టు సూచనల నేపథ్యంలో వెనక్కు తగ్గడంతో పాటు మరింతగా చెట్లను పెంచే సంకల్పం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈనెల 16 లోగా సిఎస్ కౌంటర్ దాఖలు చేయనుండగా, ముందుగా.. ఈ ప్రాంతాన్ని ఎకోపార్క్ గా మారుస్తామని ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. దాదాపు 50వేల కోట్లకు పైగా విలువైన సంపదను హైదరాబాద్ నగర నడిబొడ్డున ఎకోపార్క్ కు కేటాయిస్తే అది దేశంలోనే పెద్ద సంచలనమవుతుందన్న చర్చ ఉంది.

## గచ్చిబౌలి భూముల్లోకి బయటి వ్యక్తుల నిషేధం

**ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్న పోలీసులు**

**మహా :** కంచ గచ్చిబౌలి భూముల వ్యవహారంలో పోలీసులు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వ్యవహారంతో సంబంధం లేని వ్యక్తులు ఆ భూముల్లోకి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఆంక్షలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి రెవెన్యూ సర్వే నం.25లో గల 400 ఎకరాల భూమిపై ప్రస్తుతం వివాదం నడుస్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఈ భూముల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. తుది ఆదేశాలు జారీ చేసే వరకు ఈ భూముల్లో ఎలాంటి పనులు చేపట్టకూడదని స్పష్టం చేసింది. ఒక్క రోజులో వంద ఎకరాల్లో చెట్లు నరికేయడం ఏంటని న్యాయస్థానం మండిపడింది.

## కేరళ సీఎం విజయన్‌కు
# కేంద్రం షాక్

**ఆయన కుమార్తె వీణావిజయన్ పై విచారణకు గ్రీన్ సిగ్నల్**



(మొదటిపేజీ తరువాయి)

కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్ కంపెనీ నుంచి వీణా విజయన్‌కు చెందిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి అక్రమ రీతిలో డబ్బులు బదిలీ అయినట్లు తేలింది. సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసు దాఖలు చేసిన ఛార్జ్‌షీట్ ఆధారంగా కేసు విచారణకు కేంద్రం ఆదేశాలు ఇచ్చింది. కొచ్చిలోని ఆర్థిక నేరాలను పరిశీలించే ప్రత్యేక కోర్టులో ఈ కేసు ఫైల్ అయ్యింది.

**కంపెనీస్ యాక్ట్ ప్రకారం శిక్ష పడే అవకాశం**

సీఎంఆర్ఎల్, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ మధ్య అక్రమ రీతిలో ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు అనుమానించారు. 2017 నుంచి 2020 మధ్య కాలంలో సీఎంఆర్ఎల్ కంపెనీ నుంచి వీణా విజయన్‌కు చెందిన కంపెనీ సుమారు 1.72 కోట్లు బదిలీ అయ్యాయి. దీంతో ఈకేసులో విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐఓ ఆదేశాలు జారీ చేసింది. ఎస్ఎఫ్ఐఓ తన ఛార్జ్‌షీట్‌లో వీణా విజయన్‌తో పాటు సీఎంఆర్ఎల్ మేనేజింగ్ డైరెక్టర్ శశిథర్ కార్తా, మరో 25 మంది నిందితుల పేర్లను చేర్చింది. ఒకవేళ ఈ కేసులో వీణ దోషిగా తేలితే, ఆర్నెళ్ల నుంచి పదేళ్ల వరకు జైలుశిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. కంపెనీస్ యాక్టు ప్రకారం ఆ శిక్ష ఉంటుంది. దీంతో పాటు పెనాల్టీ విధిస్తారు. అక్రమంగా వసూల్ చేసిన మొత్తంపై మూడు రెట్ల జరిమానా వసూల్ చేయనున్నారు. కంపెనీస్ యాక్టులోని సెక్షన్ 447 ప్రకారం ఆరోపణలు చేశారు. 160 పేజీల ఛార్జ్‌షీట్ రూపొందించారు.

## బట్టబయలైన కాంగ్రెస్, బీఆర్ఎస్
# ఫెవికాల్ బంధం

**మొన్న డీలిమిటేషన్ పేరుతో ఒక్కటయ్యారు**


నిన్న వక్ఫ్ బోర్డు బిల్లుపై కాంగ్రెస్ తో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా ఓటేశారు

ఈరోజు మజ్లిస్ ను గెలిపించేందుకు రెండు పార్టీలు పోటీకి దూరమయ్యాయి

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి?

కేంద్ర మంత్రి బండి సంజయ్

**మహా :** తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయంటూ బీజేపీ చేస్తున్న ఆరోపణలు నిజమేనని తేలిపోయిందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి భండి సంజయ్ తెలిపారు. ఆ రెండు పార్టీల మధ్య ఫెవికాల్ బంధం కొనసాగుతోందన్నారు. డీలిమిటేషన్ పేరుతో మొన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని, త్వరలో తెలంగాణలో కలిసే బహిరంగ సభను నిర్వహించబోతున్నాయన్నారు. ఈ బహిరంగ సభ ఏర్పాట్లు రెండు పార్టీలు కలిసే పనిచేస్తున్నాయని, ఎవరిని పిలవాలో కలిసే డిసైడ్ చేస్తున్నాయన్నారు. అట్లాగే నిన్న పార్లమెంట్ లో వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుపై నిర్వహించిన ఓటింగ్ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటై కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటేశాయని, జీహెచ్ ఎంసీ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ కు చివరి రోజు అయినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులను నిలబెట్టకుండా మజ్లిస్ అభ్యర్థికి మద్దతుగా నిలిచాయన్నారు. ఇక అవినీతి కేసుల సంగతి సరే సరి అన్నారు. ఎన్నికలకు ముందు కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం రూ.లక్ష కోట్లు అవినీతికి పాల్పడ్డారని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నాయకులంతా కోడైకూశారని గుర్తు చేశారు. విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందం, ధరణి పోర్టల్ లో వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఫార్ములా ఈ రేసులో కేటీఆర్ అవినీతి చేశారని పదేపదే ప్రచారం చేశారు, అధికారంలోకి రాగానే కేసీఆర్ కుటుంబాన్ని జైలుకు పంపుతామన్న కాంగ్రెస్ నేతలు తీరా గెలిచాక డబ్బు సంచులకు అమ్ముడుపోయి బీఆర్ఎస్ తో కుమ్మక్కై అవినీతి కేసులన్నీ నీరుగారుస్తున్నారని సంజయ్ విరుచుకుపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు ఇంతకంటే నిదర్శనం ఏం కావాలన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడంవల్ల గత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీలు పోటీ చేయాల్సిన 30 చోట్ల మజ్లిస్ పోటీ చేసి గెలిచిందని, ఇప్పుడు బీసీ జాబితా ముసుగులో ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల విద్య, ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరగబోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలు కలిసి హైదరాబాద్ ను మజ్లిస్ పార్టీ చేతుల్లో పెట్టడానికి సిద్దమయ్యాయని, కాంగ్రెస్, బీఆర్ఎస్ చీకటి ఒప్పందాలు, కుమ్మక్కు రాజకీయాలపై తెలంగాణ సమాజం ఆలోచించాలని సంజయ్ కోరారు.



# విద్యావ్యవస్థను సంస్కరిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్ర స్థాయి పరిస్థితులకు అద్దం పట్టేలా, ఆచరణ యోగ్యంగా విధాన పత్రం ఉండాలని చెప్పారు. ప్రస్తుత విద్యా వ్యవస్థలో లోపాలు, తీసుకురావల్సిన సంస్కరణలపై ముఖ్యమంత్రి గారు ఐసీసీసీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. విద్యా రంగానికి తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత, ఉపాధ్యాయుల నియామకం, అమ్మ ఆదర్శ కమిటీలు, పుస్తకాలు, యూనిఫాంల పంపిణీతో పాటు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్స్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ నిర్మాణాన్ని ముఖ్యమంత్రి వివరించారు. ప్రాథమిక దశలో అందే విద్యతోనే పునాది బలపడుతుందని.. ప్రాథమిక విద్యను బలోపేతం చేస్తే ఉన్నత చదువుల్లో విద్యార్థులు మరింత మెరుగ్గా రాణించగలరని ముఖ్యమంత్రి గారు అభిప్రాయపడ్డారు. అంగన్‌వాడీలు, ప్రాథమిక పాఠశాల స్థాయిలో తీసుకురావల్సిన మార్పులపై సమాజంలోని వివిధ సంఘాలు, ప్రముఖులతో చర్చించి మెరుగైన విధాన పత్రం రూపొందించాలని సూచించారు. విద్యా వ్యవస్థలో తెలంగాణ అగ్రగామిగా ఉండేందుకు దోహదపడేలా సూచనలు, సలహాలు ఉండాలని చెప్పారు.

**పవర్ పాయింట్ ప్రజంటేషన్**

వివిధ రాష్ట్రాల్లో జరిపిన పర్యటనలు, ఆయా రాష్ట్రాలు, ఇతర దేశాల్లో ప్రాథమిక విద్యలో అనుసరిస్తున్న విధానాలను విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. 1960 దశకం నుంచి ఇప్పటివరకు విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన పలు సంస్కరణలు క్రమేణా విద్యార్థుల సృజనాత్మక శక్తి, ఆలోచనా ధోరణిని ఎలా హరించి వేశాయో ఫౌండేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ



(లోక్‌సత్తా జేపీ) గారు వివరించారు. విద్యా వ్యవస్థలో తీసుకోవలసిన చర్యలపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి , ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు , తెలంగాణ విద్యా కమిషన్ సభ్యులు ప్రొ. పీఎల్ విశ్వేశ్వరరావు , డా. చారుకొండ వెంకటేష్, కె. జ్యోత్స్న శివారెడ్డి , ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**యూనివర్శిటీలపై సమీక్ష**

తెలంగాణలోని విశ్వ విద్యాలయాలన్నీ విద్యార్థుల కేంద్రంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే కోర్సులు ఉండాలని, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సుల బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. విశ్వ విద్యాలయాల వైస్ ఛాన్సలర్లతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఐసీసీసీలో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ప్రభుత్వ విశ్వ విద్యాలయాలకు గ్రామీణ ప్రాంతాల నుంచి, ఆర్థిక స్థోమత లేని కుటుంబాల నుంచే విద్యార్థులు వస్తున్నారని.. వారికి సరైన భవిష్యత్ కల్పించేలా మన బోధన ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ఆర్థిక స్థోమత ఉన్న కుటుంబాల నుంచి వచ్చిన వారు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ఎంచుకొని ప్రైవేటు విశ్వ విద్యాలయాల వైపు వెళ్లిపోతున్నారని.. వారితో ఎదురయ్యే పోటీని ప్రభుత్వ విశ్వ విద్యాలయాల విద్యార్థులు ఎదుర్కోవాలంటే డిమాండ్ ఉన్న కోర్సులనే మనం బోధించాల్సి ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. గతంలో నియమించిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉన్నారనే భావనతో పలు విశ్వ విద్యాలయాల్లో పెద్దగా ప్రాధాన్యం లేని కోర్సులను బోధిస్తున్నారని, వాటిని రద్దు చేసి నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. ఆయా కోర్సులకు సంబంధించి ఉన్న ప్రొఫెసర్లకు అడ్మినిస్ట్రేటివ్ బాధ్యతలు అప్పగించాలని సీఎం పేర్కొన్నారు. కొందరు ప్రొఫెసర్లకు రిహాబిలిటేషన్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చొద్దని సీఎం సూచించారు. ఈ సందర్భంగా ఆయా యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు తమ విశ్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్ల కొరత, భవనాలు, ఇతర వసతుల సమస్యలను ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. యూనివర్సిటీల బాగుకు అవసరమైన నిధులు కేటాయించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీఎం తెలిపారు. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్లు అంతా సమావేశమై తమ ఉమ్మడి సమస్యలు, అలాగే యూనివర్సిటీల వారీగా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావుతో సమావేశం కావాలని సీఎం సూచించారు. అనంతరం యూనివర్సిటీల వారీగా తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక రూపొందించి ప్రభుత్వానికి సమర్పించాలని సీఎం సూచించారు.

# దేశంలో రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయినట్లే

## మూడోసారి గెలిచాక మోదీకి గర్వం బాగా పెరిగింది

మోదీపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత.. వాడు వీడు భిక్ష వేస్తే సీఎం సీట్లో కూర్చోను

వచ్చే ఎన్నికల్లో సొంతంగానే ప్రభుత్వం ఏర్పాటుచేస్తాం

హైదరాబాద్, రంగారెడ్డి నేతల సమావేశంలో కేసీఆర్ వ్యాఖ్యలు



**సిద్దిపేట, మహా:** దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయినట్లేనని, మోదీపై దేశవ్యాప్తంగా వ్యతిరేకత బాగా పెరిగిందని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. మూడోసారి గెలిచాక మోదీ వైఖరి చూసి ఆర్ఎస్ఎస్ కూడా ఆగ్రహంగా ఉందన్నారు. వచ్చే మూడేళ్లూ కాంగ్రెస్ పార్టీనే అధికారంలో కొనసాగుతుంది. వాడు వీడు భిక్ష వేస్తే నేను సీఎం సీట్లో కూర్చోను. ప్రభుత్వాన్ని కూల్చే పిచ్చిపిచ్చి పనులు మేం చేయబోం' అని కేసీఆర్ తేల్చి చెప్పారు. శుక్రవారం ఎర్రవెల్లిలోని ఫాంహౌజ్‌లో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నేపథ్యంలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాల పార్టీ ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మధ్యలో వచ్చి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చెప్పినా తాము ఆ పనికి ఒప్పుకోబోమని అన్నారు. అలా మధ్యలో తాము అధికారాన్ని తీసుకోబోమని అన్నారు. జనరల్ ఎన్నికల్లోనే తేల్చుకుంటామని.. మళ్లీ తామే బీఆర్ఎస్ పార్టీ గెలిచి తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటామని అన్నారు.

**మనకే మస్తు లీడర్లు ఉన్నరు**

పార్టీని వీడిన వారిని తిరిగి పార్టీలోకి చేర్చుకోమని కేసీఆర్ స్పష్టం చేశారు. పార్టీ నుంచి పోయిన వారు వస్తామంటే తీసుకునే ప్రసక్తే లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. తమకే చాలా మంది లీడర్లు ఉన్నారని.. వారికే అవకాశాలు ఇస్తామని చెప్పారు. కొత్త వారిని తయారుచేసుకుందామని అన్నారు. రాష్ట్రంలో పలు సీట్లకు ఉప ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ గెలుపొందడం ఖాయమన్నారు. అలాగే.. మనకు బీజేపీ, కాంగ్రెస్ ఎవరూ పోటీకాదన్నారు. కాంగ్రెస్ పాలనను అనుభవిస్తున్న ప్రజలు పదేళ్ల దాంక మళ్లీ దానికి ఓట్లు కూడా వేయరన్నారు. వ్యవసాయం, నీరు, కరెంటుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అందుకే ప్రజలు ఎన్నికల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారని.. ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా.. ఎప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పీడ పోతుందా అని చూస్తున్నారని అన్నారు. మళ్లీ వారు బీఆర్ఎస్ ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారని చెప్పారు.

### దేశవ్యాప్తంగా మోదీపై వ్యతిరేకత

దేశంలో మూడోసారి ప్రధానిగా అధికారం చేపట్టిన మోడీకి బాగా గర్వం పెరిగిందని కేసీఆర్ అన్నారు. తనకు తానే మేధావిని అని అనుకుంటున్నారని.. చివరకు ఆర్ఎస్ఎస్ కంటే తానే గొప్ప అనే భావనతో ఉన్నారని కేసీఆర్ చెప్పారు. ఈ విషయాన్ని ఆర్ఎస్ఎస్ సైతం గుర్తించిందని, ఆయన మీద తీవ్ర వ్యతిరేకతతో ఉన్నదని అన్నారు. ఇటు దేశవ్యాప్తంగానూ మోదీపై వ్యతిరేకత వచ్చిందన్నారు. మోదీ అబద్ధాలకు కేరాఫ్ అడ్రస్ అయ్యారని చెప్పారు. ఇక దేశంలో, రాష్ట్రంలో బీజేపీ పని అయిపోయినట్లేనని జోస్యం చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు, నవీన్ రావు, వాణి దేవి, దాసోజ శ్రవణ్, ఎమ్మెల్యేలు, మాధవరం కృష్ణారావు, మాగంటి గోపినాథ్, బండారి లక్ష్మారెడ్డి, డి.సుధీర్ రెడ్డి, ముఠా గోపాల్, మర్రి రాజశేఖర్ రెడ్డి, కాలేరు వెంకటేష్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, డా.మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి, నాయకులు పటోళ్ల కార్తీక్ రెడ్డి, మన్నె గోవర్ధన్ రెడ్డి, జయసింహ, మన్నె క్రిశాంక్, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, కల్వకుంట్ల వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## వామనరావు దంపతుల హత్య కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

దర్యాప్తు రికార్డులను సమర్పించాలన్న సర్వోన్నత న్యాయస్థానం

నాలుగు వారాలకు విచారణ వాయిదా



**మహా :** సంచలనం సృష్టించిన హైకోర్టు న్యాయవాదుల దారుణ హత్య ఘటనపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. న్యాయవాద దంపతులు గట్టు వామనరావు, నాగమణి హత్య కేసుపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సీబీఐ విచారణ జరపాలన్న పిటిషన్ పై వాదనలు జరిగాయి. ఈ కేసుకు సంబంధించిన వీడియోలు సహా అన్ని పత్రాలు తమ ముందుంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రికార్డులను పరిశీలించి సీబీఐ విచారణపై నిర్ణయం తీసుకుంటామని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో రికార్డులను అందజేయాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఆ తర్వాత విచారణను సుప్రీంకోర్టు 4 వారాలకు వాయిదా వేసింది. న్యాయవాద దంపతుల హత్య కేసును సీబీఐకి అప్పగించాలని మృతుడు వామనరావు తండ్రి ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగించాలన్న అంశంపై అభిప్రాయం తెలియజేయాలని తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. గట్టు వామనరావు దంపతుల హత్యకేసు దర్యాప్తును సీబీఐ లేదా సీఐడీకి అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని కొద్దిరోజుల క్రితం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనిపై న్యాయస్థానమే నిర్ణయం తీసుకోవాలని గతంలో ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలోనే తాజాగా ఈ కేసుకు సంబంధించిన వీడియోలు సహా అన్ని వివరాలు తమ ముందుంచాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2021 ఫిబ్రవరి 17వ తేదీన కారులో కోర్టుకు వెళుతున్న న్యాయవాద దంపతులు వామనరావు, నాగమణిలను పెద్దపల్లి జిల్లా కల్వచర్ల వద్ద నడిరోడ్డుపై కొంతమంది దుండుగులు కిరాతకంగా మారణాయుధాలతో దాడి చేసి చంపేశారు. ఈ దారుణ ఘటన తెలుగు రాష్ట్రాల్లో కలకలం రేపింది. ఈ హత్య కేసులో పలువురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. న్యాయవాద దంపతుల హత్య వెనుక రాజకీయ నేతల ప్రమేయం ఉందన్న ఆరోపణలు బలంగా వినిపించాయి.

## ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం

- డిప్యూటీ సీఎం బట్టిని కలిసిన ఉద్యోగుల జేఏసీ ప్రతినిధులు
- సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం



**మహా :** ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ బిల్లులకు త్వరలోనే మోక్షం లభిస్తుందని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ప్రజాభవన్ లో తెలంగాణ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ వి. లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను లచ్చిరెడ్డి డిప్యూటీ సీఎంకు వివరించారు. ఇందులో ప్రధానంగా ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ తో పాటు రాష్ట్ర స్థాయిలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్ బిల్లుల క్లియరెన్స్ అనివార్యతను వివరించారు. ఉద్యోగుల జేఏసీ చైర్మన్, నాయకుల వినతిపై సానుకూలంగా స్పందించిన బట్టి ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని, త్వరలోనే పెండింగ్ లో ఉన్న బిల్లులను విడుదల చేస్తామని హామీనిచ్చారు. డిప్యూటీ సీఎం ను కలిసిన వారిలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె. రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, జనరల్ సెక్రటరీ రమేష్‌పాక తదితరులు ఉన్నారు.

## వక్ఫ్ బిల్లు ఆమోదంపై మోడీ కీలక వ్యాఖ్యలు

దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించింది




**మహా :** పార్లమెంట్ ఉభయ సభల్లో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్పందించారు. సామాజిక మాధ్యమం వేదికగా స్పందిస్తూ ఇది కీలక పరిణామం అని పేర్కొన్నారు. దశాబ్దాలుగా వక్ఫ్ వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్నారు. తాజాగా బిల్లు ఆమోదంతో అట్టడుగున ఉన్న వర్గాలకు మేలు చేకూరుతుందని తెలిపారు. అంతేకాకుండా వారి గళం వినిపించే అవకాశం దక్కుతుందని చెప్పుకొచ్చారు. పార్లమెంట్ ఉభయ సభలు వక్ఫ్ (సవరణ) బిల్లు మరియు ముస్సల్మాన్ వక్ఫ్ (రద్దు) బిల్లును ఆమోదించడం కీలక పరిణామం అని అన్నారు. సామాజికఆర్థిక న్యాయం, పారదర్శకత, సమ్మిళిత వృద్ధి కోసం సమిష్టి అన్వేషణలో ఒక కీలకమైన ఘట్టమని ఆయన పేర్కొన్నారు. చాలా కాలంగా అట్టడుగున ఉన్న ప్రజలకు ఎంతగానో సహాయపడుతుంది అని మోడీ ట్వీట్ చేశారు. 12 గంటల పాటు చర్చ తర్వాత శుక్రవారం అర్ధరాత్రి దాటిన అనంతరం రాజ్యసభలో వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం పొందిందని, బిల్లుకు అనుకూలంగా 128 ఓట్లు, వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయని పేర్కొన్నారకు. చర్చ సందర్భంగా ప్రతిపక్షాలు లోపాలు ఎత్తిచూపాయంటూ మొత్తానికి ఉభయ సభల్లో సులువుగానే బిల్లు ఆమోదం పొందడం విశేషమన్నారు. ఇక ఈ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దగ్గరకు వెళ్లనుంది. రాష్ట్రపతి ఆమోద ముద్ర వేస్తే.. చట్టం అమల్లోకి రానుంది. వక్ఫ్ బిల్లుపై బుధవారం లోక్‌సభలో 14 గంటలకు పైగా చర్చ జరిగింది. అనంతరం స్పీకర్ ఓం బిర్లా ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 288 మంది, వ్యతిరేకంగా 232 మంది సభ్యులు ఓటేశారు. ఇక ఈ బిల్లు ముస్లింల ప్రయోజనాలకు హాని కలిగిస్తుందనే ఆరోపణలను మైనార్టీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తోసిపుచ్చారు. ఈ బిల్లుతో ముస్లింలకే లాభమని, బిల్లు ఆమోదంతో ముస్లిమేతరులు ఈ వ్యవహారాల్లో జోక్యం చేసుకోలేరని పేర్కొన్నారు. అయినా ఈ బిల్లు మతానికి సంబంధించింది కాదని, ఆస్తి దాని నిర్వహణకు, అవినీతిని నిర్మూలించడమే ఈ బిల్లు లక్ష్యమని మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

## చైల్డ్ రైట్స్ కమిషన్ చైర్‌పర్సన్‌గా సీతా దయాకర్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ

**హైదరాబాద్, మహా:** తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ గా మాజీ ఎమ్మెల్యే కొత్తకోట సీతాదయాకర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. సీతాదయాకర్ రెడ్డితో పాటు ఆరుగురు సభ్యులను నియమించింది. కంచర్ల వందనగౌడ్, మర్రిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలతా అగర్వాల్, బి.వచన్ కుమార్ లను సభ్యులుగా నియమిస్తూ ప్రభుత్వ కార్యదర్శి అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరంతా బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి మూడు సంవత్సరాలు లేదా వారికి 60 ఏళ్ల వయసు వచ్చే వరకు పదవిలో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం సీతాదయాకర్ రెడ్డికి నియామకపు ఉత్తర్వులు అందడంతో ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

## వక్ఫ్ సహా 16 బిల్లులకు ఆమోదం

పార్లమెంట్ నిరవధిక వాయిదా

**మహా:** లోక్‌సభ నిరవధికంగా వాయిదాపడింది. దీంతో జనవరి 31న ప్రారంభమైన బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. ప్రభుత్వానికి వ్యతిరేకంగా సోనియా చేసిన వ్యాఖ్యలపై దుమారం తర్వాత వాయిదాపడిన లోక్‌సభ, తిరిగి 12గంటలకు సమావేశం కాగానే స్పీకర్ ఓం బిర్లా సభను నిరవధికంగా వాయిదా వేసినట్లు ప్రకటించారు. ఈ సమావేశాల్లో 16బిల్లులు ఆమోదం పొందటంతోపాటు సభ 118శాతం పని చేసినట్లు తెలిపారు. ఆర్థిక బిల్లు సహా వివిధ మంత్రిత్వ శాఖల గ్రాంట్ల డిమాండ్లకు లోక్‌సభ ఆమోదంతో బడ్జెట్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్రపతి పాలనలో ఉన్న మణిపుర్ బడ్జెట్‌కు కూడా లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. అధికార ప్రతిపక్షాల బలప్రదర్శనకు కారణమైన వక్ఫ్ చట్ట సవరణ బిల్లుపై సుదీర్ఘ చర్చ తర్వాత లోక్‌సభ ఆమోదం తెలిపింది.

## వక్ఫ్ సవరణ బిల్లు-2025

సుప్రీంకోర్టును ఆశ్రయించిన కాంగ్రెస్, మజ్లిస్

**మహా :** వక్ఫ్ (సవరణ) బిల్లు2025ను సవాల్ చేస్తూ కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పార్లమెంటు ఉభయ సభల్లో వక్ఫ్ (సవరణ) బిల్లు2025 ఆమోదం పొందిన విషయం విదితమే. ఈ బిల్లును కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, మజ్లిస్ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ బిల్లు (సవరణ) బిల్లులోని నిబంధనలు ముస్లిం సమాజం యొక్క ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే విధంగా ఉన్నాయని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లు వక్ఫ్ ఆస్తులు, వాటి నిర్వహణపై ఏకపక్షంగా ఉందని, ముస్లిం సమాజానికి చెందిన మతపరమైన స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తుందని పిటిషన్‌లో ఆరోపించారు. ఇదిలా ఉండగా, వక్ఫ్ (సవరణ) బిల్లు2025 పార్లమెంటు ఉభయ సభల్లో ఆమోదం పొందిన నేపథ్యంలో కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్‌లలోని పలు ప్రాంతాల్లో ముస్లింలు నిరసనలు తెలిపారు.

## రేషన్ కార్డుదారులకు శుభవార్త ఈ -కేవైసీ గడువు పెంపు



**మహా :** రేషన్ కార్డుదారులకు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. రేషన్ కార్డుదారుల కోసం ఈ కేవైసీ ప్రక్రియ గడువును మళ్లీ పొడిగించింది. ఈ ఏడాది ఏప్రిల్ 30వ తేదీ వరకు దీనిని పొడిగించినట్లు ప్రకటించింది. అసలు అయితే మార్చి 31వ తేదీ వరకు ఈ గడువు విధించిన సంగతి తెలిసిందే. జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ఎఫ్ ఎస్ఏ) కింద లబ్ధిదారులకు సబ్సిడీ పంపిణీలో పారదర్శకతను నిర్ధారించడం, అలాగే అర్హత లేని వ్యక్తుల దుర్వినియోగాన్ని నివారించడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ పొడిగింపు వల్ల ఇప్పటి వరకు ఈ కేవైసీ పూర్తి చేయని రేషన్ కార్డుదారులు ఏప్రిల్ 30 వరకు ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చునని సూచించింది. అధికారులు సైతం ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. ఎందుకంటే మరోసారి గడువు పొడిగించే అవకాశం ఉండక పోవచ్చని వివరిస్తున్నారు. ఈ కేవైసీ పూర్తి చేయని వారి రేషన్ కార్డులు రద్దు కావచ్చునని స్పష్టం చేస్తుంది. దీని వల్ల ఉచిత రేషన్ సౌకర్యం కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొంది. ఈ విషయంలో అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం గత కొన్ని నెలలుగా ప్రచారం నిర్వహిస్తోంది. ఈ కేవైసీ ప్రక్రియను సులభంగా పూర్తి చేయడానికి రేషన్ షాపులు, ఆధార్ కేంద్రాలు లేదా ఆన్‌లైన్ పోర్టల్‌లను సంప్రదించవచ్చునని కేంద్రం స్పష్టమైన వివరణ ఇచ్చింది. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అందుకు గడువు సైతం విధించింది. ఈ గడువు పూర్తయిన వెంటనే.. ప్రభుత్వ సిబ్బంది విచారణ చేపట్టి.. అర్హులైన వారికి రేషన్ కార్డులు మంజురు చేయనున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్ల పాటు ఒక్క రేషన్ కార్డు సైతం మంజూరు చేయలేదంటూ ఇప్పటికే అధికార కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపణలు గుప్పిస్తున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులైన అందరికీ తెల్ల రేషన్ కార్డు మంజూరు చేస్తామని ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన హామీ ఇచ్చిన విషయం విధితమే.

# అలేఖ్య చిట్టి పికిల్స్..

వేగంగా ఎదిగి.. నోటిదూలతో మటాష్.. ఒక్క ఆడియోతో యాపారం బంద్

పచ్చడి కొనలేనివాడివి.. నీ పెళ్లానికి బంగారం ఏం కొనిస్తావ్ అంటూ ఆడియో వైరల్

**రాజమండ్రి, మహా:** అలేఖ్య చిట్టి పికిల్స్ నాన్ వెజ్ పచ్చళ్లకు ఫేమస్. వేగంగా పాపులర్ అయి జోరుగా నడుస్తున్న పచ్చళ్ల వ్యాపారం ఒక్కసారిగా బంద్ చేయాల్సిన పరిస్థితికి దారి తీసింది. వెబ్ సైట్ , వాట్సాప్ నెంబర్ సహా ఎకౌంట్లన్నీ క్లోజ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎంతో తెలివిగా వ్యాపారం చేసిన ముగ్గురు అమ్మాయిలు.. అనవసరంగా నోరుజారి ఇబ్బందులు కొని తెచ్చుకున్నారు. ఇపుడు ట్విట్టర్, ఇన్ స్టా, ఎఫ్ బి, యూట్యూబ్ లలో అలేఖ్య పచ్చళ్ళు కేంద్రంగానే మీమ్స్, పోస్ట్ లు వైరల్ అవుతున్నాయి. జోకులు పేలుతున్నాయి. అలేఖ్య చిట్టి పికిల్స్ వెనుక ముగ్గురు అమ్మాయిల కృషి ఉంది. చిట్టి, అలేఖ్య, రమ్య అనే ముగ్గురు అక్కాచెల్లెళ్లు పచ్చళ్ల వ్యాపారం మొదలెట్టారు. రాజమండ్రి కేంద్రంగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర రాష్ట్రాలు, ఫారెన్‌లో కూడా వీరికి కస్టమర్ల నుంచి పచ్చళ్ల ఆర్డర్‌లు వస్తుంటాయి. వాట్సప్ ద్వారా ఆర్డర్లు బాగా వస్తుంటాయి. ఈ ముగ్గురు అక్కా చెల్లెల్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా కావడంతో పచ్చళ్ల వ్యాపారం జోరుగా సాగింది.

**పచ్చళ్ల రేట్ల పంచాయతీ.. నెటిజన్ల గరంగరం**

ఇటీవల ఓ వ్యక్తి అలేఖ్య పికిల్స్‌కు హాయ్ అని వాట్సప్ చేయడంతో అటు నుంచి పచ్చళ్ల రేట్లు పెట్టారు. నాన్ వెజ్ పచ్చళ్లు అరకిలో దాదాపు రూ.530 నుంచి రూ.1660 వరకు వివిధ రేట్లు పెట్టారు. మీ పచ్చళ్లు ఇంత ధర ఎందుకున్నాయో నాకు అర్థం కావడం లేదని వ్యక్తి రిప్లై ఇచ్చాడు. దీంతో బూతులతో కూడిన వాయిస్ మెసేజ్ అటు నుంచి వచ్చిందంటూ సోషల్ మీడియాలో ఓ ఆడియో వైరల్ అయింది. '3 వేల రూపాయలు పెట్టి పచ్చడి కొనుక్కోలేని వాడివి, నీ పెళ్లానికి బంగారం ఏం కొనిస్తావ్, చీరలు ఏం కొనిస్తావ్, ముందు డబ్బులు సంపాదించుకోవటం నేర్చుకోరా' అంటూ నోటికి వచ్చిన బూతులు అడియో మెసేజ్ పెట్టింది. ఆడియో వైరల్ కావడంతో పచ్చడి రేటు ఎక్కువ ఉందని అడిగితే ఇలా పెళ్ళాం, అమ్మను తిట్టడం ఎంతవరకు కరెక్ట్ అని సోషల్ మీడియాలో అలేఖ్య చిట్టి పికిల్స్‌పై ట్రోల్ నడిచాయి. తాజాగా మరో ఆడియోలో మహిళా కస్టమర్‌ను తిట్టినట్లు ఆడియో వైరల్ అయింది. అందులో 'ఒసేయ్ పిచ్చి మొఖం దానా ఇంత తక్కువ రేట్లను కూడా నువ్వు భరించలేకపోతున్నావ్, ఎక్కువ ధర ఉందని అంటున్నావ్ అంటే.. నీ దరిద్రం ఏ రేంజ్‌లో ఉందో నేను అర్థం చేసుకోగలను.. నా మాట విని నాలుగు ఇళ్లలో పాచిపని చేసుకోని బ్రతుకు' అనే చిట్టి పికిల్స్ అడియో వైరల్ అవుతోంది. ఇక అలేఖ్య చిట్టి పికిల్స్‌పై నెటిజన్లు బాగా ట్రోల్ చేయడంతో దుకాణం బంద్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాట్సప్ అకౌంట్ ను డిలీట్ చేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో స్పందించడం లేదు. వెబ్ సైట్ కూడా ఓపెన్ కావడం లేదు. కస్టమర్లను గౌరవించాలని, ఇలా నోటిదూలతో మంచి పేరున్న బిజినెస్‌ను క్లోజ్ చేసుకున్నారని నెటిజన్లు అంటున్నారు.



EDITORIAL సంపాదకీయం

# మహాలక్ష్మి పథకంతో మహిళల ఆర్థికాభివృద్ధి





- గడ్డం క్రిష్ణమూర్తి,
సీనియర్ జర్నలిస్ట్, అసోసియేట్ ఎడిటర్

ఒక ఆలోచన ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతుంది. ఒక ఆలోచన ఎన్నో కుటుంబాలకు ఆసరాగా నిలుస్తుంది. అలాంటిదే రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణం. ఏ ఇళ్ళు అయినా ఆ ఇంటి మహిళ ఆలోచన, పని తీరు, కుటుంబ నిర్వహణను బట్టి ఉన్నతిని సాధిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకునే అధికారంలోకి రాగానే మహిళలకు మహాలక్ష్మి పేరుతో ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేస్తామన్న కాంగ్రెస్ వచ్చిన వెంటనే అమలులోకి తెచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని మహిళలు ఉపాధి అవకాశంగా మలచుకుంటున్నారు. ఉచిత ప్రయాణంపై కొంత మంది అవాకులు చెవాకులు పేలినా, కొన్ని సందర్భాలలో తోటి ప్రయాణికులకు ఇబ్బదికరంగా మారినా చాలా కుటుంబాలకు ఆసరాగా నిలుస్తోంది. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చింది. ఇందులో భాగంగా రేవంత్ రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టగానే ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఇది మహిళా సాధికారతకు పెద్ద పీట వేసింది. మహిళలకు ఉచిత బస్సు పథకం అమల్లోకి వచ్చి దాదాపు 15 మాసాలు పూర్తయింది. ఈ 15 మాసాల కాలంలో రాష్ట్రంలో ఉచిత ప్రయాణాలు 159.42 కోట్లు చేశారు. తద్వారా మహిళలకు మిగిలిన ఆదాయం రూ. 532.2 కోట్లు అని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో ఒక 10 శాతం టైంపాస్ కోసం ఉచిత ప్రయాణాలు చేశారని అనుకున్నప్పటికీ దాదాపు 90 శాతం ప్రయాణాలు మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేశాయన్నది స్పష్టం.

హైదరాబాద్ నగరానికి సుమారు వంద కిలోమీటర్ల పరిధిలోని గ్రామాలలో నివాసముంటున్న మహిళలు చాలా మంది ప్రభుత్వం ఇచ్చిన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఉపాధిని పొందుతున్నారు. గ్రామాలలో ఉపాధి పనులు అంతగా దొరక్కపోవడం, రెక్కాడితేనే డొక్కాడని పేద మహిళలు కొంతమంది వినూత్నంగా ఆలోచించడం మొదలు పెట్టి దానికి కార్యరూపం ఇచ్చారు . ఉదయం తమ గ్రామాల నుంచి బయలుదేరి నగరానికి వచ్చే ఆర్డినరీ, ఎక్స్ ప్రెస్ బస్సుల ద్వారా వీరు సిటీకి చేరుకుని శివారు ప్రాంతాలలోని ఇండ్లలో పని చేస్తున్నారు. ఇలా మధ్యాహ్నం వరకు నాలుగు నుంచి ఐదు ఇండ్లలో పనులు చేసి తిరిగి తమ ఊరికి వెళ్లిపోతూ ఇంటి పనులను చక్కదిద్దుకుంటున్నారు. కొంతమంది బస్సులలో వచ్చి అడ్డా కూలీలుగా పని చేస్తూ ఉపాధిని పొందుతున్నారు. నెలకు కనీసం ఒక్కొక్కరు పదిహేను వేల నుంచి ఇరవై వేల రూపాయల వరకు సంపాదిస్తూ కుటుంబానికి బాసటగా నిలుస్తున్నారు. ఆర్టీసీ బస్సులలో టికెట్ లేకుండా ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్గి ఉండడంతో వీరు తిరుగు ప్రయాణంలో పలు బస్సులు మారి సొంతూరికి చేరుకుంటున్నారు.

శివారు ప్రాంతాల నుంచి వేకువ జామునే సిటీకి వచ్చే బస్సుల ద్వారా గ్రామాలలో వ్యవసాయం కలిగి ఉండి పండించిన పంటలను మార్కెట్ లో విక్రయించి కూడా ఉపాధిని పొందుతున్నారు. తమ పొలాల్లో పండించిన కూరగాయలు, పండ్లు, పాలు,పెరుగుతో పాటు నెయ్యి, తేనె తదితర గ్రామీణ ఉత్పత్తులను ఆర్టీసీ బస్సులలో నగరానికి తీసుకుని వచ్చి విక్రయాలు చేపడుతూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఊర్లలో పండించిన పంటలకు అంతగా డిమాండ్ లేకపోవడం, తక్కువ ధరలకే విక్రయాలు చేపట్టాల్సి రావడంతో గతంలో గత్యంతరం లేక వారు అడిగిన ధరకే అమ్ముకునే వారు. ఇప్పుడు పరిస్థితులు మారడంతో మహిళల ఆలోచనలలో కూడా మార్పు వచ్చింది. ఫలితంగా వినియోగదారులకు సరసమైన ధరలకు నాణ్యమైన పండ్లు, కూరగాయలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా మహిళల ఆర్థిక పరిస్థితి కూడా చెప్పుకోతగ్గ రీతిలో ఉంటుంది. ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగం చేసే మహిళలు సైతం గ్రామాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. హైదరాబాద్ వంటి మహానగరంలో ఇంటి అద్దెలు ఆకాశన్నంటున్నాయి. కనీసం పదివేల రూపాయలు వెచ్చించనిదే సింగల్ బెడ్ రూం ఇండ్లు అద్దెకు లభించడం లేదు. దీంతో నగరానికి వీలైనంత దూరంలో తక్కువ అద్దెలకు ఇండ్లు కిరాయికి తీసుకుని అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సాగిస్తున్నారు. ఉదయం బయలు దేరి సిటీకి చేరుకుని ఉద్యోగం, వ్యాపార పనులు పూర్తి చేసుకుని తిరిగి వెళ్లిపోతున్నారు. మొత్తం మీద ఉచిత ఆర్టీసీ ప్రయాణం మహిళలకు ఓ వరంగా మారింది. దీంతో వారు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించడంతో పాటు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొంతూళ్లలో నివాసముంటున్న మహిళలు నగరానికి ఆర్టీసీ బస్సులలో వచ్చి పనులు చక్కబెట్టుకుని తిరిగి ఊరికి వెళ్లిపోతున్నారు. దీంతో నగరంలో ఇండ్లు అద్దెకు తీసుకునే బెడద తప్పిందని వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నగరంలోనే నివాసముంటే వచ్చే సంపాదనలో సగానికి పైగా ఇంటి కిరాయిలకు ఖర్చు అయ్యే అవకాశం ఉందని, ఉచిత బస్సు ప్రయాణం పుణ్యమా అని వాటి నుంచి ఉపశమనం పొందుతున్నారు. అంతే కాకుండా ఇండ్ల వద్దనే ఉంటూ పిల్లల మంచి చెడులు చూసుకునే అవకాశం ఉందని, మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశ పెట్టిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 97 బస్ డిపోల పరిధిలో పల్లెవెలుగు, ఎక్స్ ప్రెస్, సూపర్ లగ్జరీ, డీలక్స్, సూపర్ డీలక్స్, రాజధాని బస్సులలో రోజుకు సుమారు 64 లక్షల మంది మహిళలు ప్రయాణిస్తున్నారు . వీరిలో సుమారు 34 లక్షల మంది మహిళలు ఉచితంగా ప్రయాణం సాగిస్తుండడంతో వీరికి జీరో టిక్కెట్లు జారీ చేస్తున్నారు. మహిళల సాధిక్యారతతో ఫాటు ఆర్టీసీకి కూడా కొంత ఆర్థిక వెసులుబాటు కలుగుతోంది. ఒకప్పుడు నెలసరి వేచతనలు చెల్లించేందుకు ఎవరు అప్పులు ఇస్తారా అని ఎదురు చూసిన సంస్థ నేడు తనకు తానుగా ఆర్థిక పరిపుష్టిని సంపాదించుకుని ఉద్యోగులకు జీతాలు చెల్లించడంతో పాటు కొత్త బస్సుల కొనుగోలుకు శ్రీకారం చుట్టింది. అంతేకాకుండా డిమాండ్ కు అనుగుణంగా కొత్త డిపోలను నెలకొల్పడంతో పాటు ఉద్యోగ నియామకాలను కూడా చేపట్టేందుకు సన్నద్ధమవుతోంది. మొన్నటి వరకు సంస్థ ఆర్థిక పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తుందని, ప్రైవేట్ పరం చేస్తే తప్ప సంస్థ మనుగడ కష్టమనుకున్న తరుణంలో కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఒకే ఒక నిర్ణయం ఇటు మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు దాదాపు 50 వేల మంది ఆర్టీసీ కార్మికుల కుటుంబాలలో కూడా సంతోషాలను వెల్లి విరిచేలా ఉందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.




# ట్రంప్ ఫొటోతో యూఎస్ గోల్డ్ కార్డ్

## గోల్డ్ కార్డ్ ఫస్ట్ లుక్ విడుదల.. ఫుల్ డిమాండ్

దీన్ని కొంటే నేరుగా అమెరికా పౌరసత్వం

50 లక్షల డాలర్లు వెచ్చించేవారికి ఈ గోల్డ్ కార్డు

**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరో సంచలనానికి తెరతీశాడు. తన చిత్రంతో ఉన్న 'గోల్డ్ కార్డ్' ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. అమెరికా పౌరసత్వం కావాలని కోరుకునే సంపన్నులకు ఈ 'గోల్డ్ కార్డు' అందించనున్నట్లు ట్రంప్ ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఎయిర్‌ఫోర్స్ వన్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆయన గోల్డ్ కార్డ్‌ను చూపించారు. డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో ఉన్న ఈ గోల్డ్ కార్డును 5 మిలియన్ డాలర్లతో ఎవరైనా సొంతం చేసుకోవచ్చని ట్రంప్ పేర్కొన్నారు. దీన్ని తానే మొదట కొనుగోలు చేసినట్లు ఆయన ప్రకటించారు. అయితే రెండోది ఎవరు కొంటారనేది తనకు తెలియదన్నారు. ఈ గోల్డ్ కార్డ్ రెండు వారాల్లో అమ్ముడయిపోతుందని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు.

### నేరుగా అమెరికా పౌరసత్వం

ఈబీ5 (ఇన్వెస్టర్ వీసా) విధానాన్ని రద్దు చేసి రూ.43.5 కోట్లు (50 లక్షల డాలర్లు) వెచ్చించేవారికి ఈ గోల్డ్ కార్డు అందిస్తామని ఇటీవల ట్రంప్ ప్రకటించారు. దీన్ని కొనుగోలు చేసినవారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తామని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టామని, వారు అమెరికాకు వచ్చి భారీగా ఖర్చు పెడితే స్థానికంగా ఉద్యోగాలు పెరుగుతాయని ట్రంప్ అంటున్నారు. ఈ కార్డుకు భారీగా గిరాకీ వచ్చిందని, ఒక్కరోజే 1000 గోల్డ్ కార్డులను విక్రయించినట్లు వాణిజ్యశాఖ మంత్రి హోవర్డ్ లుట్నిక్ తెలిపారు. వీటి ద్వారా 5 బిలియన్ డాలర్లు సేకరించామని ఆయన చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా 3.7 కోట్ల మందికి ఈ గోల్డ్ కార్డు కొనే సామర్థ్యం ఉందని అన్నారు. ఈబీ5 ప్రోగ్రామ్ వల్ల జరుగుతున్న మోసాలు, ఇతర అక్రమాలను అరికట్టేందుకే వీటిని తీసుకొస్తున్నట్లు ఆయన తెలిపారు. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఈ గోల్డ్ కార్డ్ ఉపయోగపడుతుందన్నారు. అమెరికా 1990లో ఈబీ5 వీసా విధానాన్ని తీసుకొచ్చింది. వేల మంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే ఈ విధానంతో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఇటీవల జరిపిన ఓ అధ్యయనంలో తేలింది. దీంతో దీనికి 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజాగా దీని స్థానంలో గోల్డ్ కార్డును తెస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు.

# తగ్గేదెలే...

## ట్రంప్‌కు చైనా స్ట్రాంగ్ కౌంటర్

### అమెరికా ఉత్పత్తులపై 34% టారిఫ్స్ విధింపు

### ఏప్రిల్ 10 నుంచే అమలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం తీవ్రమవుతోంది. అమెరికా నుంచి తమ దేశంలోకి దిగుమతయ్యే అన్ని వస్తువులపైనా 34 శాతం సుంకాలు విధిస్తామని చైనా ప్రకటించింది. ఈనెల 10 నుంచి నూతన టారిఫ్‌లు అమల్లోకి వస్తాయని తెలిపింది. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో వినియోగించే ఏడు కీలక ఖనిజాల దిగుమతులపైనా చైనా వాణిజ్య శాఖ నియంత్రణలు విధించింది. అటు అమెరికా విధించిన ప్రతీకార సుంకాలపై ప్రపంచ వాణిజ్య సంస్థలో చైనా ప్రభుత్వం వ్యాజ్యం దాఖలు చేసింది. చైనా నుంచి అమెరికాలోకి దిగుమతయ్యే వస్తువులపై ట్రంప్ 34 శాతం సుంకాలు విధించడంతో తాజాగా డ్రాగన్ అదే స్థాయిలో సుంకాలను వడ్డించింది.

### ఓవైపు ట్రేడ్ వార్.. మరోవైపు మిలటరీ చర్చలు

అమెరికా-చైనా మధ్య సెమీకండెక్టర్, పెట్టుబడులు, టారిఫ్‌లపై తీవ్ర స్థాయిలో విభేదాలున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరు దేశాల మిలిటరీ అధికారులు భేటీ కావడం గమనార్హం. ఓ వైపు అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ తొలిసారి ఆసియా పర్యటనకు వెళ్లి, ఇండో-పసిఫిక్‌లో చైనా బలపడకుండా మిత్ర దేశాలతో చర్చలు జరిపారు. అదే సమయంలో చైనా ఈ సమావేశం నిర్వహించడం విశేషం. ట్రంప్ వాణిజ్య యుద్ధం మొదలుపెట్టిన నేపథ్యంలో హెగ్సే పర్యటన ఆసియాలో అమెరికా సైనిక మోహరింపులకు సంకేతంగా నిలిచింది. తైవాన్ జలసంధి సహా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో దూకుడును కట్టడి చేయడానికి అమెరికా సిద్ధంగా ఉందని జపాన్ పర్యటనలో ఆయన పేర్కొన్నారు. ఇటీవల చైనా నౌకాదళం ఇండో-పసిఫిక్‌లో యుద్ధ విన్యాసాలు నిర్వహించింది. అలాగే ఫిబ్రవరిలో ఆస్ట్రేలియా తీరం సమీపంలోని అంతర్జాతీయ జలాల్లో లైవ్ ఫైర్ డ్రిల్స్ చేపట్టింది. ఈ చర్యలతో ఇండో-పసిఫిక్ రక్షణపై ట్రంప్ కార్యవర్గం ఏ మేరకు కట్టుబడి ఉందో పరీక్షించినట్లైంది. ఇక రెండ్రోజుల క్రితమే తైవాన్ జలసంధిలో చైనా యుద్ధ విన్యాసాలను ముగించింది.

**రచనలకు ఆహ్వానం**

ప్రతీరోజు ప్రచురితమయ్యే ఎడిట్ పేజీకి దేశ, రాష్ట్ర రాజకీయాలు, అంతర్జాతీయ పరిణామాలు, ప్రభుత్వాల తీరుతెన్నులు, వివిధ రంగాలపై విశ్లేషణలు, వ్యాసాలు, తాజా అంశాలపై అభిప్రాయాలు పంపండి.

**మీ రచనలు పంపాల్సిన చిరునామా:**
mahaapatrika@gmail.com
whatsapp- 74369 39999

# మేడిపల్లిలో అధికారులను అడ్డుకున్న రైతులు

- పట్టా భూములలో కంచెను ఏర్పాటు చేయరాదు
- కోర్టులో పట్టా భూములపై స్టే ఉందని స్పష్టం
- సర్వే చేపడితే అడ్డుకొని తీరుతాము
- ఫార్మాసిటీ భూములలో భారీగా పోలీసుల మోహరింపు
- రైతులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలింపు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, యాచారం మండలం, మేడిపల్లి నక్కర్త, ఫార్మాసిటీ భూములలో రెండవ రోజు ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. గతంలో ఫార్మాసిటీ కోసం సేకరించిన ప్రభుత్వం భూములకు, అధికారుల సమక్షంలో హద్దురాళ్లను ఏర్పాటు చేయడంపై ఉదృత వాతావరణం నెలకొంది. పట్టా భూములపై కోర్టులో స్టే ఉండగా హద్దురాళ్లను ఎలా ఏర్పాటు చేస్తారని, రైతులు ఆర్డీవోను అడ్డుకోవడంతో ఉదృత వాతావరణం చోటుచేసుకుంది. యాచారం మండలంలోని మేడిపల్లి నక్కర్థి, గ్రామంలో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం అసైన్డ్, పట్టా భూములను సేకరించిన పరిహారం సైతం అందజేసింది. ఆ భూములలో సర్వే నిర్వహించి హద్దు రాళ్ళను ఏర్పాటు చేయడానికి ఆర్డీవో అనంత రెడ్డి, ఎమ్మార్వో అయ్యప్ప, రెవెన్యూ సిబ్బందితో, పాటు అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, డిసిపి డి సునీతరెడ్డి, ఎసిపి కెపివి రాజు, సిఐ కృష్ణంరాజు, 200 మంది పోలీస్ బలగాలతో బందోబస్తు నడుమ హద్దురాళ్లను ఏర్పాటు చేయడానికి వెళ్ళగా, తలకొండ జంగయ్య అనే రైతు సర్వే నెంబర్ 67లో తన భూమి ఉందని, అది పట్టా భూమి కోర్టులో స్టే ఉండగా ఎలా హద్దురాళ్లను ఏర్పాటు చేస్తారని నిలదీశారు. సర్వేను అడ్డుకున్న రైతులను అరెస్టు చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పట్టా భూములపై కోట్లులో స్టే ఉందని, వాటి వద్దకు వస్తే ఊరుకునేదే లేదని రైతుల స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో తమకు తీరని అన్యాయం జరిగిందని, మాకు పట్టా పాస్ బుక్ లలో మూడు ఎకరాల భూమి ఉండగా, పరిహారం మాత్రం రెండు ఎకరాలకు రావడం జరిగిందని, ఎకరం నర ఉన్న రైతుకు ఎకరంకు పరిహారం చెల్లించారని తెలిపారు. పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించేంతవరకు, మా భూములలో కంచెను ఏర్పాటు చేయరాదని ముక్తకంఠంతో చెప్పారు. నష్ట పరిహారం చెల్లించిన భూములలో హద్దురాళ్లను ఏర్పాటు చేయకుంటే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని రైతులు తెలిపారు. అలాగే అసైన్డ్ భూములు కోల్పోయిన రైతులకు, ఇంటి స్థలాలను ఇస్తామని నేటి వరకు ఇవ్వలేదని, పొజిషన్ సైతం చూపించ లేదన్నారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతనే భూములలో అడుగు పెట్టాలని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సర్వే అడ్డుకున్న రైతులను, పలు పార్టీల నాయకులను, గ్రామస్తులను అరెస్టు చేసి, గ్రీన్ ఫార్మా హైదరాబాద్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం

- తడిసిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో తడిసిన పంటపొలాలు పరిశీలన





**ములుగు, మహా :** అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, తడిసిన ప్రతీ గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖా మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని అమృతండా, లక్ష్మిపూర్, కర్లపల్లి, చంద్రుతండా గ్రామాల పరిధిలో అకాల వడగండ్ల వర్షంతో నష్టపోయిన పంటపొలాలను మంత్రి సీతక్క పరిశీలించారు. కోతకు వచ్చిన వరిధాన్యం రాలిపోయి నీళ్లపాలైందని రైతులు మంత్రికి మొరపెట్టుకున్నారు. స్పందించిన మంత్రి పంటనష్టంపై నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు ఫోన్ చేసి జరిగిన పంట నష్టాన్ని వివరించి పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ అకాల వర్షంతో గోవిందరావుపేట మండలంలోని పలు గ్రామల్లో కోతకు వచ్చిన వరి పంట వడగండ్ల వానకు నేలారాలిందని, నీళ్లపాలైన పంటపొలాలను పరిశీలించి వెంటనే సర్వే చేసి నష్టం అంచనా వేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. రైతులు అధైర్య పడొద్దని, రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్ట పరిహారం అందిస్తామని, తడిసిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, డీఏవో సురేష్ కుమార్, టీపీసీసీ సభ్యుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లాది రాంరెడ్డి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్ గౌడ్, కార్మిక శాఖ జిల్లా అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇస్సార్ ఖాన్, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

**జిల్లా ఆస్పత్రిలో రాత్రిపూట వైద్యులుండరా..? : మంత్రి సీతక్క ఆగ్రహం**

వైద్యులు దేవుళ్లతో సమానమని, అలాంటి పవిత్రమైన వృత్తిలో ఉండి కూడా జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో రాత్రిపూట వైద్యులు అందుబాటులో ఉండకపోవడమేంటని రాష్ట్ర మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యులు, సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి ఆపద కాలంలో వచ్చే రోగులకు సేవలందించాలని సూచించారు. శుక్రవారం ములుగులోని జిల్లా ఆస్పత్రిని మంత్రి సీతక్క ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రాత్రివేళల్లో వైద్యులు ఆసుపత్రిలో అందుబాటులో ఉండటం లేదని తెలుసు కున్న మంత్రి సీతక్క సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలురకాల వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వస్తున్న రోగులకు నమ్మకం కలిగేలా సేవలందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మీటింగ్ హాల్ లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రోగ్రాం ఆఫీసర్స్ , మెడికల్ ఆఫీసర్స్, సూపరింటెంట్, జిల్లా వైద్య నిపుణులు , మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్, సిబ్బందితో మంత్రి సీతక్క జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్ లతో కలిసి ప్రత్యేకంగా సమావేశమై పీహెచ్సీల వారిగా సమీక్షించారు. సాధారణ ప్రజలే మనకు దేవుళ్ళుగా భావించి మానవీయ కోణంలో జనంతో మమేకమై ప్రజలు గుర్తుంచుకునేటట్లు, ప్రేమ ఆప్యాయతలతో మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. అప్పుడే సాధారణ ప్రజలకు వైద్య ఆరోగ్యశాఖ పట్ల నమ్మకం కలుగుతుందని అన్నారు. జిల్లాలో ములుగు, ఏటూరునాగారం ప్రధాన ఆస్పత్రులు, ఇతర ఆసుపత్రులలో యువ వైద్యులు ఉన్నారని, మానవతా దృక్పథంతో వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడానికి 108 సిబ్బంది 15 నిమిషాలలో ప్రభుత్వ ఆసుపత్రికి చేర్పించాలని అన్నారు. ఎండాకాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలపట్ల అవగాహన కల్పించాలన్నారు. మౌలిక సదుపాయాల పై నివేదిక సమర్పించాలని, నిధులను మంజూరు చేస్తానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు, జిల్లా ఆసుపత్రి సూపరిండెంట్ జగదీశ్వర్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ లాల్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్స్ చంద్రకాంత్, పవన్ కుమార్, రణధీర్, కిషోర్, ప్రేమ్ సింగ్, ప్రత్యేక వైద్యనిపుణులు, డెమో సంపత్, పీహెచ్సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

# ఆరు యేండ్ల లోపు వారిని అంగన్వాడీల్లో చేర్పించాలి

- మహిళలందరికీ వైద్య పరీక్షలు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి




**కరీంనగర్, మహా :** ఆరు సంవత్సరాలలోపు పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రాలలో చేర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తల్లిదండ్రులకు సూచించారు. తిమ్మాపూర్ మండలం పర్లపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చదువుతోపాటు ఆరోగ్యం పై శ్రద్ధ వహిస్తారని అన్నారు. నూతన సిలబస్ తో, ప్రత్యేక శిక్షణ పొందిన టీచర్లతో అంగన్వాడీల్లో బోధిస్తున్నామని అన్నారు. పిల్లలు ఎత్తుకు తగిన బరువుతో ఆరోగ్యంగా ఉండేలా అంగన్వాడీల్లో శ్రద్ధ తీసుకుంటారని తెలిపారు. పిల్లలందరిని అంగన్వాడీలకు పంపించాలని సూచించారు. ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని పర్లపెల్లి గ్రామంలోని మహిళలందరూ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా 50 రకాల వైద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని తెలిపారు. ఇదివరకే ఈ గ్రామంలో రెండు సార్లు మెడికల్ క్యాంపులు నిర్వహించామని, వచ్చే నెలలో మరో సారి క్యాంపు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు అందజేసే ఈ క్యాంపును నూరు శాతం మహిళలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. బీపీ, షుగర్ వంటి వ్యాధులకు కూడా ఇక్కడ ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. ఆరోగ్య మహిళ పరీక్ష ద్వారా ప్రమాదకరమైన వ్యాధులను ముందుగా గుర్తించి నివారించవచ్చని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ మహిళలు, పిల్లలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న పథకాలు, సేవల గురించి శుక్రవారం సభలో తెలియజేస్తామని అన్నారు. మహిళలు తమ సమస్యలను ఈ సభలో అధికారుల దృష్టికి తీసుకురావచ్చని అన్నారు. శుక్రవారం సభ ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని మహిళల్లో రక్తహీనతను నివారించగలుగుతున్నామని అన్నారు. అనంతరం గర్భిణీలకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సబిత, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి సాజిత, సిడిపిఓ శ్రీమతి పాల్గొన్నారు.

# శ్రీ గోవిందరాజుల స్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**వరంగల్ మహా ;** వరంగల్ తూర్పు నియోజకవర్గంలో ప్రాచీన ప్రసిద్ధిగాంచిన శ్రీ గోవిందరాజుల స్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుండి 26వ తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మిట్టపల్లి భాస్కర్, 27వ డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, ఆధ్వర్యంలో సీనియర్ నాయకులు గోపాల్ నవీన్ రాజ్, మీసాల ప్రకాష్ , చింతాకుల సునీల్, మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, చేతుల మీదుగా శుక్రవారం ఆలయ ప్రాంగణంలో బ్రహ్మోత్సవాల పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు భాష పాక సదానందం, కొమ్ము రాజకుమార్, ఇప్ప ఆదినారాయణ, ఇనుగాల శరత్, ఎర్రం కమల్, పొలెపాక యాకూబ్, ముఖ్య నాయకులు, శ్రీదేవి గీతా ఆలయ అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం గోపాల్ నవీన్ రాజ్, మీసాల ప్రకాష్, చింతాకుల అనిల్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖ చొరవతో గోవిందరాజు స్వామి బ్రహ్మోత్సవాలు, రథోత్సవం, అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలకు నగరం నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని విజ్ఞప్తి చేశారు.

# నగరానికి విచ్చేసిన శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ



**వరంగల్, మహా ;** వరంగల్ నగరంలోని పోచమ్మ మైదానం, లో గల ప్రముఖ ప్రసిద్ధిగాంచిన శ్రీ ఆనంద భాష్పాంజనేయ స్వామీ దేవాలయానికి శ్రీ శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ శుక్రవారం ఉ. 12.00 గ లకు విచ్చేసారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య దంపతులు స్వామి వారిని సాదరంగా ఆహ్వానించగా స్వామి వారినీ మంగళ వాయిద్యాల నడుమ మహిళలు మంగళహారతులు చేపట్టి దారివెంట పువ్వులను వెదజల్లుతూ భక్తులు, స్థానిక ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి వారు శ్రీ ఆనంద బాష్పంజనేయ స్వామి విగ్రహానికి విశిష్ట పూజలు నిర్వహించి భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు బస్వరాజు శిరీష శ్రీమాన్, గుండేటి నరేందర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కొరివి పరమేష్, మాజీ కార్పొరేటర్లు తత్తరి లక్ష్మణ్, దామెర సర్వేషం, బిళ్ళ శ్రీకాంత్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోరంట్ల రాజు, చాగంటి శ్రీనివాస్, కరాటే ప్రభాకర్, లింగమూర్తి, బండి సురేందర్, ఇమ్రాన్, క్యాతం వేణు, మస్తాన్ హనుమాన్ వ్యాయామశాల నిర్వాహకులు సోమరాతి సుధాకర్, బస్వరాజు రమేష్ లతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ సీతారాముల విగ్రహాలను అందజేసిన హిందూ సేవా సమితి



**వరంగల్, మహా;** సనాతన హిందూ సేవా సమితి ఆధ్వర్యంలో 47వ సేవా కార్యక్రమంలోభాగంగా వరంగల్ కరీమాబాద్ బీఆర్ నగర్ లోని శివాలయంలో శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కళ్యాణ మహోత్సవానికి శ్రీ సీతా రాములు.. లక్ష్మణ, ఆంజనేయ స్వామి విగ్రహాలను అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్, అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు, సలహాదారు ప్రతాపగిరి గణేష్, సభ్యులు కందికొండ మోహన్, నోముల మహేష్ బాబు, మిట్టపెల్లి రాకేష్, తౌటం రాజేష్, పెంచాల నవీన్, పిన్నింటి యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పంపిణీని విజయవంతం చేయాలి

- పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- సమీక్షలో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా :** ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని మంత్రి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారితో కలిసి జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సన్న బియ్యం పంపిణీ పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఇప్పటికే అన్ని మండల, గ్రామ కేంద్రాల్లో నిర్వహించడం జరిగిందన్నారు. స్థానిక మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలతో చర్చించి కార్యాచరణ ప్రణాళిక మరింత ముందుకు తీసుకుపోవడానికి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, జిల్లా పౌర సరఫరాల అధికారులు శ్రీనివాస్, గోపీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పరకాల పోలీస్ స్టేషన్ ను సందర్శించిన సీపీ



**వరంగల్, మహా ;** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం పరకాల డివిజన్ పరిధిలోని పరకాల పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తోలిసారిగా పరకాల పోలీస్ స్టేషన్ ను సందర్శించిన పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సిసి కెమెరాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది వివరాలను సిపి సంబంధిత స్టేషన్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ ను అడిగి తెలుసుకొవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అత్యధికంగా ఎలాంటి నేరాలు నమోదవుతాయి. స్టేషన్ పరిధిలో ఎన్ని సెక్టార్లు వున్నాయి, సెక్టార్‌వారిగా ఎస్.ఐలు నిర్వహిస్తున్న విధులు, వారి పరిధిలోని రౌడీ షీటర్లు, అనుమానితులు వారి ప్రస్తుత స్థితి గతులను సంబంధిత సెక్టార్ ఎస్.ఐని అడిగి తెలిసుకోవడంతో పాటు స్టేషన్‌వారిగా బ్లూకోల్ట్స్ సిబ్బంది పనితీరుతో పాటు, వారు విధులు నిర్వహించే సమయాలను పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు పలు సూచనలు చేస్తూ నేరాల నియంత్రణకై విజుబుల్ పోలీసింగ్ అవసరమని, ఇందుకొసం నగరంలో నిరంతం పోలీసులు పెట్రొలింగ్ నిర్వహించాలని పోలీస్ కమిషనర్ స్టేషన్ అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనర్ వెంట ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, పరకాల ఏసీపీ సతీష్ బాబు, ఇన్స్ స్పెక్టర్ క్రాంతి కుమార్, ఎస్సైలు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలి



**తాడ్వాయి, మహా;** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల్ స్కూల్ అన్యువల్ డే సెలబ్రేషన్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ విద్యా సంవత్సరంలో చదువుల్లో మంచి ప్రతిభ కనబరిచిన ,వివిధ ఆటల్లో మరియు స్కూల్లో జరిగే వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రోత్సాకంగా బహుమతులను అందజేశారు.. విద్యార్థులకు చదువు యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ ఉన్నత శిఖరాలు ఎదగటానికి ఎలా ఉపయోగపడతాయి వారి భవిష్యత్తుని ఏ విధంగా మెరుగుపరుచుకోవాలని పలు సూచనలు చేశారు. విద్యార్థినిలు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహ్లాదకరంగా జరిగాయి. ప్రభుత్వ ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ రేవతి ఆధ్వర్యంలో ముఖ్య అతిథులుగా ఎంఈఓ రేగ కేశవరావు, స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి లు మాట్లాడుతూ.. విద్యార్థినిలు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను సాధించి తల్లిదండ్రులకు, గురువులకు పుట్టిన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు.

# మంత్రివర్గంలో ఎమ్మెల్యే రంగారెడ్డికి చోటు కల్పించాలి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాష్ట్ర మంత్రివర్గంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేకు చోటు దక్కాలని నియోజకవర్గ యువజన కాంగ్రెస్ నాయకులు సికిందర్ రెడ్డి, శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో నూటొక్క కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డికి రాష్ట్ర మంత్రివర్గంలో చోటు దక్కాలని, ఇబ్రహీంపట్నం ప్రజల కల్పతరువు అయిన శ్రీశ్రీశ్రీ కట్ట మైసమ్మ అమ్మవారికి ఆలయంలో, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వేదిరి సికిందర్ రెడ్డి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు నూటొక్క కొబ్బరి కాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా సికిందర్ రెడ్డి మాట్లాడుతూ... గత 40 సంవత్సరాల నుండి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా, హైదరాబాద్ ప్రాంతంలో బలమైన నాయకుడిగా ఎంతమంది కార్యకర్తలను తయారు చేసి, వారిని నాయకులగా ఎదిగే విధంగా కృషిచేసి, కార్యకర్తలకు బాసటగా నిలిచిన నాయకులు, సుదీర్ఘమైన అనుభవం, సూదూరమైనటువంటి అలోచన కలిగిన ప్రజాబంధు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి అని అన్నారు. గత శాసనసభ ఎన్నికల్లో రంగారెడ్డి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన ఏకైక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఆయనకి రాష్ట్ర క్యాబినెట్ లో స్థానం కల్పించాలన్నారు. జిల్లా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని, ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇచ్చి జిల్లా అభివృద్ధికి సహకరించాలని, కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు సికిందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నిశ్చితార్థ వేడుకలకు హాజరైన కంది మౌనా శ్రీనివాస రెడ్డి

**ఆదిలాబాద్ మహా :** కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ సిబ్బంది లో ఒకరైన నందు, నందిని నిశ్చితార్థ వేడుకలకు అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనాశ్రీనివాస రెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి హాజరయ్యారు. తమ కార్యాలయంలో పని చేసే సిబ్బంది పట్ల తమకున్న అనుబంధాన్ని చాటిచెప్పారు. జైనథ్ మండలం కాప్రి గ్రామంలోని వరుడి నివాసంలో జరిగిన నిశ్చితార్థ కార్యక్రమంలో పాల్గొని కాబోయే నూతన వధూవరులను ఆశీర్వదించి కంది శ్రీనన్న పెళ్ళి కానుకను బహుకరించారు. కార్యక్రమంలో గడ్డం శరణ్య రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ రావు,మహిళా నాయకురాలు శ్రీలేఖ మునిగేల విట్టల్,సింగిరెడ్డి రామ్ రెడ్డి,తుడుం రాములు,గ్రామ నాయకులు కంది నరోత్తం రెడ్డి,సామ లింగ రెడ్డి,ఎల్మ రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



# పేద ప్రజలందరికీ సన్నబియ్యం

- ఇదే ప్రభుత్వ సంకల్పం
- సన్న బియ్యం పంపిణీని ప్రారంభించిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

**కాటారం, మహా :** ఆహార భద్రత కార్డుదారులందరికీ సన్న బియ్యం అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని,మేనిఫెస్టోలో పేర్కొన్నట్టుగా హామీని నెరవేర్చినట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం కాటారం సబ్ డివిజన్ కేంద్రంలో కాటారం, మలహర్,మహాదేవపూర్, పలిమెల, మహా ముత్తారం మండలాలకు సన్నబియ్యం పంపిణీని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా అధికారులతో కాటారంలో ప్రారంభించారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఒకటి తర్వాత ఒకటి అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక వ్యవస్థ గాడి తప్పినప్పటికీ సీఎం రేవంత్ రెడ్డి, నేటిపారుదల పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సంకల్పంతో పేద ప్రజలకు కడుపు నిండాలే.. పేద ప్రజలు సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్నికలలో ప్రజలు ఉత్సాహంతో ఇచ్చిన తీర్పు, ఆశీర్వాదంతో ప్రజలకు మేలు చేయాలనే తపనతో ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలుకు కృషి చేస్తోందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఒక కుటుంబంలో ఒక్కో సభ్యునికి ఆరు కిలోల చొప్పున నలుగురున్న సభ్యులకు 24 కిలోలు ప్రభుత్వం ఉచితంగా సన్నబియ్యం సుమారు రూ1400 విలువ కుటుంబానికి ఆదా జరుగుతుందన్నారు. ధనికులే కాకుండా పేద ప్రజలు తమ బియ్యం తినాలని ఆకాంక్ష నెరవేరిందని లబ్ధిదారులు సంతోషంగా ఉన్నారని శ్రీధర్ బాబు వివరించారు. దేశంలోనే సన్న బియ్యం పథకం అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని గత ప్రభుత్వ హయాంలో దొడ్డు రకం బియ్యం రీసైక్లింగ్ తో ప్రభుత్వానికి పదివేల కోట్లు నష్టం వాటిల్లడం, రూ 3 నుండి 4 వేల కోట్లు ప్రభుత్వంపై అదనపు భారం పడుతున్న భరిస్తూ ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు.

**సన్న వడ్ల రకానికి బోనస్సే**

ద ప్రజల అభివృద్ధి కై ఖరీఫ్ సీజన్లో సన్న వడ్ల ఉత్పత్తికి కోసం రైతులకు రూ 500 చొప్పున బోనస్ ఇచ్చామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు తోటే రాష్ట్రంలో పెద్ద ఎత్తున వరి పంట పండినట్లు ఆరోపించారని, ఆ ప్రాజెక్టు కూలిపోయిన తర్వాత రికార్డు స్థాయిలో 156.78 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి జరిగిందన్నారు. బిఆర్ఎస్ పాలనలో రైతుల కు ఖరీఫ్ సీజన్లో రూ 10,400 కోట్లు చెల్లిస్తే 2024 ఖరీఫ్ సీజన్లో రూ 12,511 కోట్లు చెల్లించామన్నారు. బిఆర్ఎస్ మాటలతో కాలం గడిపినట్లు రైతులకు గత ప్రభుత్వం ఎప్పుడు బోనస్ ఇవ్వలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రూ 2 వేల కోట్లు బోనస్ చెల్లించినట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.



**రేషన్ డీలర్ల సమస్యల కు పరిష్కారం**

తెల్ల రేషన్ కార్డుదారులందరికీ అన్న బియ్యం పంపిణీ చేయాలని అధికారులు నిగా ఉంచాలని ఎలాంటి అవకతవకలు ఉండవద్దని మంత్రి అన్నారు. రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంటుందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో రేషన్ డీలర్ల పాత్ర ముఖ్యమైనదని, పంపిణీ లో ఎలాంటి తప్పులు జరగకుండా సక్రమంగా పనిచేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని శ్రీధర్ బాబు తెలిపారు

**వాగ్దానాల అమలుకు పారిపోవడం లేదు**

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్టు పారిపోవడం లేదని మహాలక్ష్మి పథకం, గృహజ్యోతి, వ్యవసాయానికిఉచిత కరెంటు, రూ 500 లకే సిలండర్, సన్న బియ్యం పంపిణీ, యువతి యువకులకు ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. మంథని నియోజకవర్గంలో 3500 ఇందిరమ్మ పథకంలో గృహ నిర్మాణాలు చేస్తామని నిరుపేదలకే గృహాలు మంజూరు చేయాలని ఎలాంటి పైరవీలకు అవకాశం ఇవ్వకుండా అర్హులైన వారిని ఎంపిక చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పౌర సరఫరాల అధికారి శ్రీనాద్, పౌర సరఫరాల డిఎం రాములు, మండల ప్రత్యేక అధికారి, డిఆర్డీఓ నరేష్, జిఎం సిద్దార్థ, కాటారం డివిజన్ మండలాల తహసీల్దార్లు, ఎంపిడివోలు పాల్గొన్నారు.

## హెచ్ సి యు భూముల పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నాం

**మోత్కూర్, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని బీఆర్ఎస్ నాయకులు, హెచ్ సి యు భూములపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో భూములపై కాంగ్రెస్ దొంగలు పడుతున్నారని వాపోయారు, రాష్ట్ర సీఎం గా ఉన్న రేవంత్ రెడ్డి సీఎం లాగా కాకుండా రియల్ ఎస్టేట్ ఏజెంట్ లాగా వ్యవహరిస్తున్నాడు, హెచ్ సి యు విద్యార్థులను గుంట నక్కలు అనడం అమానుషం, పర్యావరణాన్ని కాపాడటంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది, 400 ఎకరాల భూమిపై స్టే విధించి సుప్రీమ్ కోర్టు గొప్ప విషయం అని కొనియాడారు, తమ హక్కుల కోసం పోరాడిన విద్యార్థులకు, అధ్యాపకులకు,విద్యార్థి సంఘాల నాయకులు



ధన్యవాదాలు తెలిపారు,ఇకపై రేవంత్ రెడ్డి ఎక్కడ విద్య వ్యతిరేక విధానాలకు పాల్పడిన బీఆర్ఎస్ నాయకులం ఎక్కడికి అక్కడ ఎండగడతమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, జంగ శివ,పబ్బు ప్రవీణ్, జిట్ట సాయి కుమార్, గాణగని రాజేష్,దాసరి నరేష్, దాసరి నవీన్ కుమార్, కూరెళ్ళ రమేష్, పొన్నెబోయిన మచ్చగిరి, చుక్క అశోక్ తదితరులు పాల్గొన్నారు.


## మోడీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి




**సూర్యాపేట, మహా:** మోడీ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నాయకులు కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన భారతీయ జనతా పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు, చల్లా శ్రీలతరెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఇట్టి సమావేశం ఉద్దేశం 6వ తారికున బిజెపి పార్టీ ఆవిర్భావ దినోత్సవం మరియు పార్టీ సంస్థాగత విషయాల, గూర్చి సమావేశం నిర్వహించడం జరుగింది. ఈ సమావేశంనికి ముఖ్య అతిథిగా హుజుర్నగర్ మాజీ శాసన సభ్యుడు శానం పూడి సైదిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ మోదీ ప్రవేశ పెట్టిన పథకాలను ప్రజలలో తీసుకవెళ్లాలని, రానున్న స్థానిక సంస్థ గత ఎన్నికలలో, కార్యకర్తలు యుద్ధ ప్రాతిపరిచిన పనిచేసి భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించి బిజెపి జెండా ఎగరవేయాలని దిశా నిర్దేశం చేశారు, ఈ కార్యక్రమంలో మోత్కూర్ మండల బిజెపి అధ్యక్షులు, గుదే మధుసూదన్ యాదవ్, మాజీ అధ్యక్షులు, దిటి సందీప్, గుంటి సతీష్, నర్సింగ్ మహేష్, లెల్లెల బాల నర్సయ్య, ముక్కుల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పరీక్ష ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులు

**మేళ్లచెరువు, మహా :** మేళ్లచెరువు మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు గురుకుల పాఠశాల 5వ తరగతి మొదటి ప్రవేశ పరీక్షలలో ప్రతిభ కనబరిచారు. 9 మంది విద్యార్థులు పరీక్ష లో పాల్గొనగా అందులో 8 మంది విద్యార్థులు సెలెక్ట్ అయినట్లుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోటేశ్వరరావు, తెలియజేశారు.సెలెక్ట్ అయిన విద్యార్థులు. బి.రేణుక, వై. శశికళ, సిహెచ్.సంతోష్, వి. గాయత్రి,కే.సంజన,టి.రిషి, టి.యశ్వంత్,వి. లక్ష్మీనారాయణ,ఎం.చరణ్ రాజు,ఈ విద్యార్థులు సెలెక్ట్ అయినట్లుగా తెలియజేసినారు. వీరికి ముఖ్య కారణం సాహో ఉపాధ్యాయులైన వింధ్య, పూర్ణిమ, యొక్క సమిష్టి కృషి వల్ల సాధించగలిగినట్లు చెప్పినారు విద్య ఆరంభం నుండి ఆ విద్యార్థుల పట్ల ప్రత్యేక తరగతులు



నిర్వహిస్తూ పాత మోడల్ పేపర్లను రాయిస్తూ ఎప్పటికప్పుడు వారి ప్రగతిని లెక్కిస్తూ ముందుకు సాగినారు అందువలనే ఇంతటి మంచి ఫలితాలు వచ్చాయని ఉపాధ్యాయులు చెప్పుకొచ్చారు. అయితే రెండవ లిస్టులో కూడా మరో పాప త్రివేణి సెలెక్ట్ అయ్యే అవకాశాలు ఉన్నాయని ఉపాధ్యాయులు గట్టి నమ్మకంతో ఉన్నారు. మొత్తం దళిత కుటుంబాలకు చెందిన వారు ప్రతిభ కనబరిచడం గొప్ప విషయం అని ఇంతటి విజయాన్ని కృషిచేసి సాధించడానికి ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు పూర్తి సాయ సహకారాలు అందించినందుకు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామ పెద్దలు అభినందించారు.అదేవిధంగా మఠంపల్లి మండలంలోని అంటే తండా ప్రాథమిక పాఠశాలకు సంబంధించిన 4గురు విద్యార్థులు సీట్లు సాధించడం సంతోషకర విషయమని వారు బానోతు శ్రీవల్లి గుగులోతు శ్రీవిద్య బనావత్ వసంత ధీరావత్ సింధు లను ప్రధానోపాధ్యాయులు ఎస్.కె మస్తాన్ ఉపాధ్యాయులు అనిల్ కుమార్ బాలాజీ అభినందించారు.

## రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యం

- అర్హులైన ప్రతీఒక్కరికి ఇందిరమ్మ ఇళ్ళు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ




**శాయంపేట, మహా ;** రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడానికి రాహుల్ గాంధీ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదానికి పిలుపు ఇచ్చినట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు. అన్నారు. శుక్రవారం భూపాలపల్లి నియోజకవర్గ పరిధిలోని గట్లకానిపర్తి గ్రామంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ముందుగా గ్రామంలోని రైస్ మిల్లు నుండి అంబేద్కర్ కూడలి వరకు పాదయాత్ర నిర్వహించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడా బాబులు ముఖ్యమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లను ఇస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ అన్నారు. ఈ కార్యక్రమాలల్లో ఎమ్మెల్యే వెంట వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదిలాబాద్ లో 9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్



**ఆదిలాబాద్ మహా :** ఆదిలాబాద్ పట్టణం లోని జెడ్పి క్వార్టర్స్ ఏరియా వద్ద పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో శుక్రవారం సిసిఎస్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలోని పోలీసులు దాడి చేసారు. అక్కడ ఒక గదిలో పేకాట ఆడుతూ పట్టుబడిన పట్టణానికి చెందిన తొమ్మిది మంది కుందావార్ రాజేష్, దేగావత్ అశోక్, నల్లూరి దామోదర్ , టి సునీల్ గౌడ్ బెజ్జంకి అనిల్, కే గజానన్, తోట శ్రీనివాస్ , సిగ్గం రాజేష్, ఆకుల భూమయ్య వద్ద నుండి రూ 39వేల 6 వందల నగదు, పేకాట ముక్కలు,7 బైకులు, 9 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకున్నారు. ఆదిలాబాద్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసారు.

# తెలంగాణ పోరాటానికి 25ఏళ్లు

- ఉద్యమ స్ఫూర్తితో పార్టీ పునరుజ్జీవానికి కృషి చేయాలి
- బీఆర్ఎస్ జిల్లా ఇన్చార్జి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి
- హాజరైన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

**ములుగు, మహా :** తెలంగాణ ఉద్యమ పోరాటానికి 25ఏళ్లు అని, అదే స్ఫూర్తితో ప్రజల సంక్షేమం కోసం ప్రతీ ఒక్కరూ పనిచేయాలని బీఆర్ఎస్ ములుగు జిల్లా ఇన్చార్జి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశానికి నాగజ్యోతి తోపాటు నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగజ్యోతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో వ్యతిరేక వస్తోందన్నారు. ఇచ్చిన హామీలకు, చేస్తున్న పనులకు పొంతన లేకుండా పాలన సాగుతోందన్నారు. నీళ్లు, నిధులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిరిగి పాతరోజులు వస్తున్నాయని, మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మార్గదర్శకాల మేరకు రాబోవు రోజుల్లో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యకర్తలు శక్తివంచన లేకుండా ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వారికి మద్దతుగా నిలవాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. ములుగులో ఈసారి



బీఆర్ఎస్ జెండా ఎగురుతుందని, కార్యకర్తలకు ఏ సమస్య వచ్చినా జిల్లా నాయకులం ముందుండి కాపాడుకుంటామన్నారు. మోసపోతే గోసపడతామని ఎన్నికల ముందు చెప్పిన మాటలు వినకుండా తప్పు చేశామనే భావన ప్రజల్లో వస్తోందన్నారు. తెలంగాణలో ప్రజల గౌరవ మర్యాదలను కాపాడుకుంటూ ప్రజల కోసం తిరిగి ఉద్యమం చేయాలని మాజీ సీఎం కేసీఆర్ దిశానిర్దేశం చేశారని, కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఈనెల 27 హన్మకొండ జిల్లాలో జరిగే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## కేసుల మూలాలకు వెళ్ళి నేరస్తులను అరెస్టు చేయాలి

**హన్మకొండ, మహా ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రతి ఒక్క పోలీస్ అధికారి ప్రత్యేక కృషి చేయాల్సి ఉంటుందని బాధితులు ఇచ్చిన ఫిర్యాదులకు వెంటనే స్పందించి దర్యాప్తులో భాగంగా కేసుల మూలాలకు వెళ్ళి నేరస్తులను అరెస్టు చేయాలని అధికారులకు పోలీస్ కమిషనర్ సూచించారు. ముఖ్యంగా గంజాయి కేసుల్లో రవాణాకు పాల్పడే వ్యక్తులను మాత్రమే కాకుండా గంజాయిని అందించేవాడితో పాటు దానిని స్వీకరించే వ్యక్తులను కూడా అరెస్టు చేయాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు పిలుపు నిచ్చారు. ఫిబ్రవరి నెల సంబంధించి నెలవారి నేర సమీక్షా సమావేశాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ కమిషనరేట్ కార్యాలయములో నిర్వహించారు. వరంగల్ కమిషనరేట్ చెందిన పోలీస్ అధికారులు పాల్గోన్న ఈ సమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా సుధీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను సమీక్ష జరపడంతో పాటు పెండింగ్‌కు గల కారణాలను పోలీస్ కమిషనర్ సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను అడిగి తెలుసుకోవడం తో పాటు కేసుల పరిష్కారం కోసం అధికారులు తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లను పోలీస్ స్టేషన్ పిలిపించడం కాకుండా, అధికారులు రౌడీ షీటర్లను వ్యక్తిగతంగా కలుసుకోవడం లేదా పరిసరాల్లో ఉండి




వారి నుండి రౌడీ షీటర్ ప్రస్తుత స్థితిగతులను అరాతీయాలని, ఆస్తి నేరాలకు సంబంధించి అధికారులు జైలు నుండి విడుదలయ్యే నిందితుల సమాచారాన్ని సేకరించాలని, ఈ ఆస్తి నేరాల్లో పోలీస్ హట్ స్పాట్‌లుగా గుర్తించి, అధికంగా నేరాలు జరిగే ప్రాంతాల్లో ముమ్మర పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించడంతో పాటు, ట్రై సిటి పరిధిలో ట్రాఫిక్ పోలీసులతో పాటు పోలీస్ స్టేషన్ అధికారులు సైతం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని సూచిస్తూ, ముఖ్యంగా పోలీస్ స్టేషన్ వచ్చే ఫిర్యాదుల పై స్టేషన్ తప్పనిసరిగా కేసులను నమోదు చేయాలని, ప్రధానంగా ప్రజావాణి నుండి ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించాల్సి వుంటుందని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో డిసిపిలు షేక్ సలీమా, రాజమహేంద్రనాయక్, అంకిత్‌కుమార్, జనగాం ఏఎస్పీ చైతన్య, ఏ.ఎస్పీ మనాన్‌భట్, అదనపు డిసిపిలు రవి, సురేష్‌కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు, పాల్గోన్నారు.

## అడ్మిషన్స్ తీసుకుంటున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

**మోత్కూర్, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ చైతన్య స్కూల్ ముందుగానే బుక్స్ కొనాలని పిల్లల తల్లి తండ్రులపై ఒత్తిడి తీసుకొస్తున్న యాజమాన్యం, భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్. ఎఫ్.ఐ గా మోత్కూర్ మున్సిపాలిటీల్ కేంద్రంలో ఉన్న శ్రీ చైతన్య పాఠశాలను ఎస్. ఎఫ్.ఐ సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్. ఎఫ్.ఐ. రాష్ట్ర కమిటీ సభ్యులు బుర్రు అనిల్ కుమార్ మాట్లాడుతూ మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలో ఉన్నటువంటి శ్రీ చైతన్య స్కూల్ కార్పొరేట్ స్కూల్ విధంగా వ్యవహరించి అకడమిక్ ఇయర్ స్టార్ట్ కాకముందుకే ముందస్తుగా అడ్మిషన్స్ తీసుకుంటూ అదే విధంగా పై తరగతి బుక్స్ కూడా ఇప్పుడే కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లితండ్రులను మనో వేదనకు గురిచేస్తునటువంటి కనపడుతుంది. పాఠశాల యాజమాన్యం కూడా నిర్లక్ష్యమైన సమాధానాలతో వ్యవహరిస్తున్నటువంటి పరిస్థితి కనబడుతోంది. స్థానిక ఎంఈఓ, కి కూడా సమాచారం అందించడం. జరిగింది, అయిన కూడా పాఠశాల యజమాన్యం తీరు మాత్రం సరి చేసుకోకపోవడం బాధాకరమైనటువంటి విషయంగా కనబడుతోంది.ఈ కార్యక్రమంలో నాయకులు పెరిక రాకేష్, ప్రశాంత్,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి




**పరకాల, మహా :** అభివృద్ధి పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, టెక్స్టైల్ పార్క్ లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా పరకాల మున్సిపల్ కార్యాలయం సమావేశ మందిరంలో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పనుల పురోగతిపై వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ, కె ఆర్ నాగరాజు,సిపి సన్ ప్రీత్ సింగ్, వరంగల్ హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, ప్రావీణ్య,కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి తో కలిసి మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, నిర్వహణకు దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు.కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో మంజూరు చేసిన అభివృద్ధి పనులను వేగవంతంగా చేపట్టి పూర్తి చేయాలన్నారు. కాకతీయ మెగా టెక్స్ టైల్ పార్క్‌లోని ఇండస్ట్రీల్లో స్థానికులకే ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, అందుకు గాను స్కిల్ ట్రైనింగ్ సెంటర్ల ద్వారా స్థానికులకు నైపుణ్యం కల్పించి నియమించు కోవాలని అన్నారు. యంగ్ వన్, గణేష ఈకో టెక్స్టైల్స్ కంపెనీల ద్వారా నిర్వహణ గురించి తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ లిమిటెడ్ (టిజిఐఐసి) డైరెక్టర్ ధరణికాంత్ మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అశ్విని తనాజీ వాకడే, డీఎఫ్ఓ అనుజ్ అగర్వాల్, సంబంధిత శాఖల అధికారులు, కైటెక్స్ యంగ్ వన్ గణేశా కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రియల్‌ఎస్టేట్ పెట్టుబడులు పెరిగాయ్..

**న్యూఢిల్లీ:** దేశీ రియల్టీ రంగంలో సంస్థాగత పెట్టుబడులు 2025 జనవరి-మార్చిలో 31 శాతం జంప్ చేసినట్లు రియల్టీ కన్సల్టెంట్ కొలియర్స్ ఇండియా పేర్కొంది. ప్రధానంగా రెసిడెన్షియల్ విభాగంలో పెట్టుబడులు పుంజుకోవడంతో 1.3 బిలియన్ డాలర్లను తాకినట్లు ఒక నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం వీటిలో 60 శాతం వాటాతో దేశీ ఇన్వెస్టర్లు ప్రధాన పాత్ర పోషించారు. వార్షికంగా 75 శాతం వృద్ధితో 0.8 బిలియన్ డాలర్లు ఇన్వెస్ట్ చేశారు. పెట్టుబడుల్లో ఇండస్ట్రియల్, వేర్‌హౌసింగ్, ఆఫీస్ విభాగాలకు ప్రాధాన్యత ఇచ్చారు. హౌసింగ్ విభాగంలో నిధులు 3 రెట్లు ఎగసి 30.29 కోట్ల డాలర్లకు చేరగా.. గతేడాది ఇదే కాలంలో 10.26 కోట్ల డాలర్లు మాత్రమే లభించాయి. ఆఫీస్ కాంప్లెక్సులలో సంస్థాగత పెట్టుబడులు 23 శాతం క్షీణించి 43.42 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. గత జనవరి-మార్చిలో 56.3 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.





## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

### ట్రంప్ టారిఫ్‌ల దెబ్బ.. షేర్లు టపా టపా..

దేశీయ స్టాక్ మార్కెట్‌లు శుక్రవారం భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాల ప్రకటనల తర్వాత భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో సెషన్లో అమ్మకాలను కొనసాగించాయి. 30 షేర్ల సెన్సెక్స్ 930.67 పాయింట్లు లేదా 1.22 శాతం క్షీణించి 75,364.69 వద్ద స్థిరపడింది. సూచీ 76,258.12 నుంచి 75,240.55 శ్రేణిలో ట్రేడ్ అయింది. నిఫ్టీ 50 కూడా 345.65 పాయింట్లు లేదా 1.49 శాతం క్షీణించి 22,904.45 వద్ద స్థిరపడింది. టాటా స్టీల్, టాటా మోటార్స్, లార్సెన్ అండ్ టూబ్రో, అదానీ పోర్ట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టెక్ మహీంద్రా, రిలయన్స్ ఇండస్ట్రీస్ షేర్లు 8.36 శాతం వరకు నష్టపోయాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్, నెస్లే ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్ 1.59 శాతం వరకు లాభపడ్డాయి. నిఫ్టీ స్మాల్ క్యాప్ 100 ఇండెక్స్ 3.56 శాతం క్షీణించడంతో స్మాల్ క్యాప్ షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ కూడా 2.91 శాతం నష్టపోయింది. నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ మినహా అన్ని రంగాల సూచీలు నష్టాల్లో స్థిరపడగా, మెటల్, ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, ఆటో, రియల్టీలు 2-6.5 శాతానికి పైగా నష్టపోయాయి.


## రూ.9.97 లక్షల డుకాటీ బైక్ లాంచ్: వివరాలు



డుకాటి స్క్రాంబ్లర్ ఐకాన్ డార్క్ మోడల్.. ఇండియన్ మార్కెట్లో లాంచ్ అయింది. దీని ధర రూ. 9.97 లక్షల (ఎక్స్‌షోరూమ్, ఇండియా). ఈ బైక్ చూడటానికి దాని స్టాండర్డ్ మోడల్ కంటే భిన్నంగా ఉంటుంది. కానీ ఇంజిన్, పర్ఫామెన్స్ వంటి వాటిలో ఎటువంటి మార్పు లేదు. డుకాటి స్క్రాంబ్లర్ ఐకాన్ డార్క్ ఎడిషన్ అనేది.. ప్రస్తుతం భారతదేశంలో అమ్మకానికి ఉన్న అత్యంత సరసమైన డుకాటి బైక్. ఇందులో 803 సీసీ ఇంజిన్ ఉంటుంది. ఇది 73 హార్స్ పవర్, 65.2 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. సుమారు 176 కేజీల బరువున్న ఈ బైక్ మంచి పనితీరుని అందిస్తుంది. స్క్రాంబ్లర్ ఐకాన్ డార్క్ దాని మెయిన్ ఫ్రేమ్, సైకిల్ పార్ట్స్, ఎలక్ట్రానిక్స్ ప్యాకేజీ అన్నీ కూడా స్టాండర్డ్ మోడల్‌లో మాదిరిగానే ఉంటాయి. TFT డిస్ప్లే, రైడ్‌బైవైర్, కార్నరింగ్ ఏబీఎస్, ట్రాక్షన్ కంట్రోల్ వంటి ఫీచర్స్ కూడా ఇందులో ఉన్నాయి. ఇవన్నీ రైడర్లకు మంచి రైడింగ్ అనుభూతిని అందిస్తాయి.

## ఉద్యోగం కోసం మూడేళ్లు...

### హృదయాన్ని కదిలించే పోస్ట్



చదువుకుని డిగ్రీలు తెచ్చుకోవడం ఒక ఎత్తైతే.. ఉద్యోగం సంపాదించడం మరో ఎత్తు అయిపోయింది. ఈ పోటీ ప్రపంచంలో నచ్చిన ఉద్యోగాలు దొరక్క కొందరు సతమవుతుంటే.. అసలు ఉద్యోగాలే లభించనివారు చాలామందే ఉన్నారు. మూడేళ్లు ఉద్యోగం కోసం ప్రయత్నించిన ఓ వ్యక్తి.. సోషల్ మీడియాలో చేసిన ఒక పోస్ట్ నెట్టింట్లో దుమారం రేపుతోంది. బెంగళూరుకు చెందిన 'ప్రశాంత్ హరిదాస్' అనే వ్యక్తి.. మూడు సంవత్సరాలుగా ఉద్యోగం కోసం ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో విసుగెత్తిపోయి.. తనకు తానే లింక్డ్ఇన్‌లో 'రెస్ట్ ఇన్ పీస్' అని ఒక పోస్ట్ చేశాడు. దీంతో నెటిజన్లు తమదైన రీతిలో స్పందిస్తూ.. మేమున్నాం అంటూ రిప్లై ఇస్తున్నారు. పరిశ్రమ నాయకులారా, నన్ను దెయ్యంలా చూసి రిజెక్ట్ చేసినందుకు ధన్యవాదాలు. నేను ఎంత మంచివాడిని అయినా.. ఎన్ని రెకమెండేషన్స్ పెట్టినా.. ఈ పోస్ట్ పెట్టిన తరువాత నాకు జాబ్ ఇవ్వరని తెలుసు. నేను ఆత్మహత్య చేసుకోను. ఎందుకంటే చేయాల్సిన పనులు చాలా ఉన్నాయి. రుచి చూడాల్సిన వంటకాలు, సందర్శించాల్సిన ప్రదేశాలు చాలా ఉన్నాయి. అయితే సుమారు మూడు సంవత్సరాలు నిరుద్యోగిగా.. ఒంటరిగా ఉండటం చాలా కష్టం అని ప్రశాంత్ పోస్ట్ చేసాడు. ఈ పోస్టుపై పలువురు స్పందించారు. నేను మీ మాటలు విన్నాను, మీ ప్రయాణం ఎంత కఠినంగా ఉందో ఊహించగలను. ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఒంటరిగానే ఉంటాయి. కానీ మీ ప్రయత్నాలు వృథా కాదు. పట్టు వదలకుండా శ్రమించండి, అని ఒకరు కామెంట్ చేశారు. మీ పరిస్థితిని నేను అర్థం చేసుకోగలను, మీ పట్ల సానుభూతి ఉంది. కరోనా మహమ్మారి మనందరినీ ఒంటరిని చేసింది. ప్రస్తుతం జాబ్ మార్కెట్ మునుపటిలా లేదు. తల పైకెత్తి చూడండి. నా నెట్‌వర్క్.. అనుభవం మీకు సహాయం చేయగలితే సంతోషిస్తాను అని ఇంకొకరు అన్నారు. ఇలా ఎవరికీ తోచిన రీతిలో.. వారు తమ సానుభూతిని తెలియజేస్తున్నారు.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## వక్ఫ్ బిల్లుపై సుప్రీంకోర్టును ఆశ్రయించిన అసదుద్దీన్ ఒవైసీ



**ఢిల్లీ:** వక్ఫ్ బిల్లుపై అసదుద్దీన్ ఒవైసీ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వక్ఫ్ సవరణ బిల్లును సుప్రీంకోర్టులో ఆయన సవాల్ చేశారు. వక్ఫ్ బిల్లు చట్ట విరుద్ధమని.. వక్ఫ్ ఆస్తులు లాక్కునే కుట్ర జరుగుతోందంటూ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఈ వివాదాస్పద బిల్లు ఆమోదం పొందడాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ ఎంపీ మహ్మద్ జావేద్, ఏఐఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వేర్వేరు పిటిషన్లు దాఖలు చేశారు. కాగా, రెండు రోజుల పాటు జరిగిన సుదీర్ఘ చర్చ, తీవ్రస్థాయి వాదోపవాదాల అనంతరం వక్ఫ్ (సవరణ) బిల్లు-2025పై పార్లమెంటు ఆమోద ముద్ర పడింది. విపక్షాల తీవ్ర అభ్యంతరాల మధ్యే లోక్‌సభ బుధవారం ఈ బిల్లును ఆమోదించడం తెలిసిందే. అది గురువారం రాజ్యసభ ఆమోదం కూడా పొందింది. 13 గంటలకు పైగా జరిగిన చర్చ అనంతరం అర్ధరాత్రి ఒంటి గంట దాటాక ఓటింగ్ ప్రక్రియ సుదీర్ఘంగా జరిగింది. దాదాపుగా ప్రతి సవరణపైనా ఓటింగ్‌కు విపక్షాలు పట్టుబట్టాయి. వాటి సవరణలన్నీ వీగిపోయాయి. చివరికి బిల్లు ఆమోదం పొందింది. దానికి అనుకూలంగా 128, వ్యతిరేకంగా 95 ఓట్లు పడ్డాయి. వక్ఫ్ బిల్లును కేంద్రం ఇక రాష్ట్రపతి ఆమోదానికి పంపనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అది చట్టంగా రూపుదాల్చుతుంది. వక్ఫ్ బిల్లును లోక్‌సభ 288-232 ఓట్లతో ఆమోదించడం తెలిసిందే.

## జనాలే లేని ద్వీపంపై పన్నులా? ట్రంప్ సుంకాలపై పెంగ్విన్స్ సెటైర్లు



అమెరికాఅధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దాదాపు 1800 దేశాలను టార్గెట్ చేస్తూ పరస్పరం (రెసిప్రోకల్ టారిఫ్స్) పన్నులు విధించడం యావత్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురి చేశాయి. అనేక దేశాధినేతలు తమ స్పందన వెల్లడించారు కూడా. దీనిపై సోషల్ మీడియాలో వ్యంగ్యబాణాలు వెల్లువెత్తాయి కూడా. మరీ ముఖ్యంగా అయితే జనావాసాలు లేని ఒక ద్వీపంపై ట్రంప్ సుంకాలు విధించిన తీరు మరింత విస్మయ పర్చింది. దీనిపై పెంగ్విన్ మీమ్స్ ఇంటర్నెట్‌లో తెగ హల్‌చల్ చేస్తున్నాయి. సబ్ అంటార్కిటిక్ హిందూ మహాసముద్రంలోని హర్డ్ అండ్ మెక్‌డొనాల్డ్ దీవుల పై ఎందుకు పన్నులు విధించారు అనేదే పెద్ద ప్రశ్న. మానవ జనాభా లేని బంజరు సబ్‌అంటార్కిటిక్ ఆస్ట్రేలియన్ ప్రాంతమైన హర్డ్ , మెక్‌డొనాల్డ్ దీవుల నుండి వచ్చే అన్ని ఎగుమతులపై ట్రంప్ 10శాతం సుంకాలను విధించారు. అయితే ఈ దీవులు ఆస్ట్రేలియా భూభాగం కిందకు వస్తాయి కాబట్టి.. వాటిని టారిఫ్స్ జాబితాలో చేర్చినట్లు వైట్ హౌస్ అధికారి వివరణ ఇచ్చారు. వాస్తవానికి ఈ దీవుల్లో మనుషులు నివసించరు. దాదాపు 80 శాతం మంచుతో కప్పబడిన ఈ ప్రాంతం యునెస్కో వీటిని ప్రపంచ వారసత్వ సంపద జాబితాలో కూడా చోటు సంపాదించుకుంది. దీవులు యాక్టివ్ అగ్నిపర్వతాలు, వివిధ సముద్ర జంతువులకు నిలయంగా ఉండటంతో అక్కడ ప్రజలు నివసించటం లేదు. దాదాపు దశాబ్ధకాలం నుంచి ఆ ప్రాంతాన్ని ఎవ్వరూ సందర్శించలేదని తెలుస్తోంది. ఈ ప్రాంతం పెంగ్విన్లు, సీల్స్‌కు ఆవాస ప్రాంతంగా ఉంది.

ఓవల్ ఆఫీసులో ఉక్రెయిన్ నాయకుడు వోలోడిమిర్ జెలెన్స్కీ స్థానంలో పెంగ్విన్‌ను అమెరికా అధ్యక్షుడు ,ఉపాధ్యక్షుడు వాన్స్‌తో ఇటీవల జరిగిన వివాదాస్పద సమావేశానికి ఉటింకిస్తూ ఒక మీమ్ ఉంది. జెలెన్స్కీ ప్లేస్‌లో పెంగ్విన్‌ను ఉంచారు. మరొక మీమ్ యుఎస్ ప్రథమ మహిళ మెలానియా ట్రంప్ కెనడా మాజీ ప్రధాన మంత్రి జస్టిన్ ట్రూడో స్థానంలో చక్రవర్తి పెంగ్విన్‌ను చూస్తున్నట్లు ఉంది. "పెంగ్విన్‌లు సంవత్సరాలుగా మనల్ని చీల్చి చెండాడుతున్నాయి" అని మొదిసారి ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో మాజీ కమ్యూనికేషన్స్ చీఫ్‌గా 11 రోజులు పనిచేసిన ఆంథోనీ స్కారాముచ్చి వ్యంగ్యంగా ట్వీట్ చేశారు. చమత్కరించారు. ఈ సుంకాల జాబితాలో రష్యా లేదనే వాస్తవాన్ని ప్రస్తావిస్తూ. "ట్రంప్ పుతిన్‌పై కాదు పెంగ్విన్‌లపై సుంకాలను విధించారు" అంటూ అమెరికా సెనేట్ డెమోక్రటిక్ నాయకుడు చక్ షుమర్ పోస్ట్ చేశారు. మరోవైపు ట్రంప్ సుంకాల దెబ్బతో అమెరికా మార్కెట్లు భారీ నష్టాల్లోకి జారుకున్నాయి. 2020లో కోవిడ్ మహమ్మారి తర్వాత మళ్లీ ఇపుడు స్టాక్స్ తీవ్రంగా నష్టపోతున్నాయి.

## గూగుల్ మ్యాప్‌తో రాంగ్ టర్న్!



వాళ్లంతా ఒకే ఏరియాలో ఉండే స్నేహితులు. సరదా ట్రిప్పు కోసం కారులో కొద్ది దూరం వెళ్లారు. కానీ, తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు వాళ్లలో ఇద్దరిని కబళించింది. ప్రమాద ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులకు.. ఇదంతా గూగుల్ మ్యాప్ చేసిన నిర్వాకమనే విషయం తెలిసి కంగుతిన్నారు. ఢిల్లీలక్నో హైవేపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన కారుట్రక్కు ప్రమాదంలో విస్తుపోయే విషయం ఒకటి ఇప్పుడు వెలుగు చూసింది. గూగుల్ మ్యాప్ చూపించినట్లుగా ముందుకెళ్లిన కారు.. అనూహ్యంగా ట్రక్కు ఢీ కొట్టడంతో ప్రమాదానికి గురైందని పోలీసులు దాదాపుగా నిర్ధారణకు వచ్చారని ఎన్డీటీవీ ఒక కథనం ఇచ్చింది. హర్యానా రోహ్‌తక్‌కు చెందిన శివాని, సిమ్రాన్, రాహుల్, సంజూలు నైనిటాల్‌లోని నీమ్ కరోలీ బాబా ఆశ్రమ్‌కు వెళ్లి తిరిగొస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి టైంలో బైపాస్ గుండా వెళ్లాల్సిన కారు.. అనూహ్యంగా ఢిల్లీ వైపు మలుపు తిరిగింది. అంతలో రామ్‌పూర్ నుంచి ఢిల్లీ వైపు వేగంగా వెళ్తున్న సిమెంట్ దిమ్మెలతో కూడిన ట్రక్కు వీళ్ల కారును బలంగా ఢీ కొట్టింది. ఆ ప్రమాద తీవ్రతకు ట్రక్కు బోల్తా పడగా.. కారు నుజ్జు అయ్యి ట్రక్కు కింద ఇరుక్కుపోయింది. దీంతో క్షగాత్రులు సాయం కోసం కేకలు వేశారు. సుమారు 15 మంది(ట్రక్కు డ్రైవర్‌తో సహా).. దాదాపు గంట సేపు అతికష్టం మీద శ్రమించి కారులో ఉన్న నలుగురు క్షతగాత్రులను బయటకు తీశారు. అయితే అప్పటికే తీవ్ర రక్తస్రావమైన శివాని, సిమ్రాన్‌లు అక్కడికక్కడే మరణించారు. మిగిలిన ఇద్దరిని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఆ టైంలో డ్రైవర్ సీట్‌లో ఉన్న వ్యక్తి దగ్గర ఫోన్ గూగుల్ మ్యాప్ ఆన్ చేసి ఉంది. బహుశా ఆ రాంగ్ టర్నే ప్రమాదానికి కారణమై ఉంటుందని భావించిన పోలీసులు.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుల నుంచి అదే విషయాన్ని ధృవీకరించుకున్నారు.

## మా చేతుల్లో ఏం లేదు.. పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్‌పై సుప్రీం కోర్టు



భారత్‌లో చిన్నారులు సోషల్ మీడియా వాడకుండా నిషేధించాలన్న ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఆ నిర్ణయం తమ చేతుల్లో లేదన్న సర్వోన్నత న్యాయస్థానం.. కేంద్ర ప్రభుత్వాన్ని, సంబంధిత అధికార యంత్రాగాన్ని సంప్రదించాలని పిటిషనర్‌కు సూచించింది. సోషల్ మీడియా వాడకం వల్ల చిన్నారులపై శారీరకంగా, మానసికంగా, ప్రభావం పడుతోందని, కాబట్టి 13 ఏళ్లలోపు పిల్లలు వాడకుండా చట్టబద్ధమైన నిషేధం విధించాలని ఓ పిల్(PIL) దాఖలైంది. అంతేకాదు 1318 ఏళ్లలోపు పిల్లల సోషల్ మీడియా అకౌంట్ల పర్యవేక్షణ తల్లిదండ్రుల పర్యవేక్షణలో ఉండేలా చూడాలని జెప్ ఫౌండేషన్ ఈ పిల్‌లో కోరింది. దీనిని పరిశీలించిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం.. అది తమ పరిధిలోని అంశం కాదని, విధానపరమైన నిర్ణయమని చెబుతూ పిల్‌ను తిరస్కరించింది.

### పిల్‌లో ఏముందంటే..

13 ఏళ్లలోపు వయసున్నవాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లను వాడకూడదంటూ ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ నామమాత్రంగా నిబంధనను పెట్టాయి. కేవలం యూజర్లు రిపోర్ట్ చేసినప్పుడు మాత్రమే అలాంటి అకౌంట్ల వివరాలు బయటకు వస్తున్నాయి. ఇదీ ఆందోళన కలిగించే అంశమే. మైనర్ల సోషల్ మీడియా అకౌంట్లకు కూడా అనియంత్రిత యాక్సెస్unrestricted access ఉంటోంది. దీని మూలంగా వాళ్ల మానసిక ఆరోగ్యంపై ప్రభావం పడుతోంది. మైనర్లు సోషల్ మీడియా వాడకుండా నియంత్రించని ఈ వ్యవహారం.. ఆర్టికల్ 21 ప్రకారం జీవించే ప్రాథమిక హక్కును తీవ్రంగా ఉల్లంఘించడమే అవుతుంది. కాబట్టి, కఠిన జరిమానాలు, ఇతర చర్యల ద్వారా పిల్లల చేతికి సోషల్ మీడియా వెళ్లకుండా కట్టడి చేయాల్సిన అవసరం ఉంది. భారత్‌లో యువత సగటున ప్రతీరోజు ఐదు గంటలపాటు సోషల్ మీడియాలో గడుపుతున్నారు. ఈ సమయం గణనీయంగా పెరుగుతూ పోతుండడం ఆందోళన కలిగించే అంశం. అందుకు తగ్గట్లే దేశంలో సైబర్ నేరాలు.. మైనర్లకు సైబర్ వేధింపులు పెరిగిపోతున్నాయి. ఉదాహరణకు.. మహారాష్ట్రలో 917 ఏళ్లలోపు పిల్లలు 17 శాతం ఆరు గంటలకు పైగా సోషల్ మీడియా, గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లలో గడుపుతున్నారు. ఇది వాళ్ల చదువులపై, జీవన శైలిపై తీవ్ర ప్రభావం చూపెడుతోందని ఓ అధ్యయనం వెల్లడించింది. ఆస్ట్రేలియా, యూకే, అమెరికాలో పలు రాష్ట్రాలు మైనర్లు సోషల్ మీడియా ఉపయోగించకుండా కఠిన నిబంధనలను అమలు చేస్తున్నాయి. భారతదేశ జనాభాలో దాదాపు 30% మంది 418 సంవత్సరాల వయస్సు మధ్యే ఉంది. కాబట్టి 13 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై చట్టబద్ధమైన నిషేధాన్ని అమలు చేయడం అత్యవసరం. అయితే పైన పేర్కొన్న దేశాలు మైనర్లకు సోషల్ మీడియా కట్టడిని కేవలం ప్రత్యేక చట్టాల ద్వారా మాత్రమే చేయగలిగాయి. ఏ సందర్భంలోనూ న్యాయ వ్యవస్థ జోక్యం చేసుకోలేదు. కాబట్టి భారత్‌లోనూ చట్ట ప్రక్రియ ద్వారా మాత్రమే కట్టడి చేయాల్సిన అవసరం ఉంటుందనేది నిపుణుల మాట.



## ఎన్టీఆర్ కి పోటీగా రజనీకాంత్.. ఇట్స్ కన్ఫర్మ్

కొన్నిరోజుల నుంచి అనుకున్నదే జరిగింది. సూపర్ స్టార్ రజనీకాంత్ 'కూలీ'.. ఎన్టీఆర్ పాన్ ఇండియా సినిమాకు పోటీగా నిలిచింది. సాతంత్ర్య దినోత్సవ కానుకగా ఆగస్టు 14న థియేటర్లలోకి వస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ మేరకు పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో రజినీకాంత్ తో పాటు నాగార్జున, ఉపేంద్ర, శ్రుతిహాసన్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ కూడా ఉన్నాడని సమాచారం. ఇదివరకే షూటింగ్ పూర్తయినట్లు ప్రకటించారు. ఆగస్టు అంటే చాలా టైమ్ ఉంది కాబట్టి అన్ని పనులు అంతలోపు పూర్తి చేస్తారు. మరోవైపు ఆగస్టు 14నే ఎన్టీఆర్ నటించిన బాలీవుడ్ మూవీ వార్ 2 రాబోతుంది. ఇందులో హృతిక్ రోషన్ మరో హీరో. నార్త్ లో దీనికి పెద్దగా పోటీ ఉండకపోవచ్చు గానీ దక్షిణాదిలో మాత్రం 'కూలీ' పోటీ గ్యారంటీ. తొలుత కూలీ వారం లేటుగా రావొచ్చేమో అన్నారు కానీ లాంగ్ వీకెండ్ దృష్ట్యా ఆగస్టు 14నే వస్తామని క్లారిటీ ఇచ్చేశారు. దీంతో రజినీ vs తారక్ ఖరారైంది.



## మరింత యంగ్‌గా ఉన్నానని రిజెక్ట్ చేశారు: బుట్టబొమ్మ


బుట్టబొమ్మ పూజా హెగ్డే ప్రస్తుతం బాలీవుడ్ సినిమాలతో బిజీగా ఉంది. అంతకుముందు సల్మాన్ ఖాన్ సరసన కిసీ కా భాయ్.. కిసీ కీ జాన్ చిత్రంలో కనిపించిన ముద్దుగుమ్మ.. ఇటీవలే దేవా మూవీలో ప్రేక్షకుల ముందుకొచ్చింది. షాహిద్ కపూర్ హీరోగా నటించిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పెద్దగా రాణించలేకపోయింది. ఇక సినిమా రిజల్ట్ ఎలా ఉన్నా బుట్టబొమ్మకు అవకాశాలు మాత్రం క్యూ కడుతున్నాయి. ప్రస్తుతం కోలీవుడ్‌లో రెట్రో, జన నాయగన్ లాంటి సినిమాల్లో కనిపించనుంది. అంతేకాకుండా బాలీవుడ్‌లో వరుణ్ ధావన్‌తో సరసన హై జవానీ తో ఇష్క్ హోనా హైలో కూడా పూజా నటించనుంది. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూకు హాజరైన ముద్దుగుమ్మ తన కెరీర్‌లో ఎదురైన అనుభవాలను పంచుకుంది. ఇటీవల ఓ తమిళ చిత్రం కోసం ఆడిషన్‌కు వెళ్లగా తనను తిరస్కరించారని బుట్టబొమ్మ తెలిపింది. అయితే తనను ఎందుకు రిజెక్ట్ చేశారో కూడా వివరించింది. ఆ పాత్రకు నా వయస్సు సరిపోదని.. అందువల్లే తిరస్కరించినట్లు పూజా వెల్లడించింది. నా కంటే కాస్తా ఎక్కువ వయస్సు ఉన్న వారిని ఎంపిక చేశారని పూజా చెప్పుకొచ్చింది. ఇలా ఆడిషన్స్‌కు వెళ్లడం వల్ల ఒక నటిగా తనను తాను నిరూపించుకోవడానికి సహాయపడుతుందని పూజా హెగ్డే పేర్కొంది. తాను ఎలాంటి పాత్రనైనా చేయగలననే నమ్మకం మేకర్స్‌కు కలిగించడమే నా ఉద్దేశమని చెప్పింది. తాను కష్టపడి పని చేయడానికి వెనకాడనని.. ఆడిషన్స్‌కు వెళ్లేందుకు అహంకారం ప్రదర్శించనని తెలిపింది. అ ఏదేమైనా ఒక నటిగా ఆడిషన్స్‌కు వెళ్లడానికి తాను ఎప్పుడు సిగ్గుపడనని అంటోంది మన బుట్టబొమ్మ. కాగా.. పూజా హెగ్డే ప్రస్తుతం కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహిస్తోన్న రెట్రో మూవీలో కనిపించనుంది. కోలీవుడ్ స్టార్ సూర్య సరసన నటిస్తోంది. అంతేకాకుండా దళపతి విజయ్ మూవీ జన నాయగన్‌లో హీరోయిన్‌గా మెప్పించనుంది. బీస్ట్ తర్వాత విజయ్‌తో కలిసి పనిచేయనుంది.



## ఇడ్లీ కొట్టు మూవీ వాయిదా.. ఏకంగా ఆరు నెలలు తర్వాత!

కోలీవుడ్ స్టార్ హీరో ధనుశ్ ప్రస్తుతం ఇడ్లీ కడై(తెలుగులో ఇడ్లీ కొట్టు) మూవీతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. గతేడాది రాయన్ సినిమాతో సూపర్ హిట్ కొట్టిన స్టార్ కొత్త ఏడాదిలో స్వీయ దర్శకత్వంలో మరో మూవీలో నటిస్తున్నారు. ఈ చిత్రంలో నిత్యా మీనన్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'తిరుచిత్రంబలం' ఈ జంట మరోసారి అభిమానులను మెప్పించనుంది. ఈ చిత్రాన్ని డాన్ పిక్చర్స్, వండర్‌బార్ ఫిల్మ్స్ పతాకాలపై ధనుశ్, ఆకాశ్ భాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన బిగ్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ముందుగా ప్రకటించినట్లుగా ఏప్రిల్ 10న విడుదల కావాల్సిన ఈ సినిమా ఊహించని విధంగా వాయిదా పడింది. ఈ విషయాన్ని చిత్ర నిర్మాణ సంస్థ వెల్లడించింది. ఈ మేరకు స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఇడ్లీ కడై సినిమాను అక్టోబర్ 1వ తేదీన థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. అయితే ఈ మూవీ వాయిదా వేయడానికి గల కారణాలు మాత్రం వెల్లడించలేదు. అయితే ఈ ఏప్రిల్ 10వ తేదీన అజిత్ కుమార్ హీరోగా నటించిన గుడ్ బ్యాడ్ అగ్లీ విడుదల కానుంది. ఈ సినిమాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మించారు. అందువల్లే ఇడ్లీ కడై సినిమాను వాయిదా వేసినట్లు తెలుస్తోంది. అయితే ఏకంగా ఆరు నెలల వరకు రిలీజ్ వాయిదా వేయడమే అభిమానులను షాకింగ్‌కు గురి చేస్తోంది. కాగా.. ఇడ్లీ కడై మూవీని గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో అరుణ్ విజయ్, షాలినీ పాండే, ప్రకాష్‌రాజ్, రాజ్‌కిరణ్ ప్రధాన పాత్రలు పోషించారు. కాగా 'ఇడ్లీ కడై' తెలుగు విడుదల హక్కులను శ్రీ వేధాక్షర మూవీస్ అధినేత, నిర్మాత చింతపల్లి రామారావు సొంతం చేసుకున్నారు.

## స్క్విడ్ గేమ్ నటుడికి శిక్ష విధించిన కోర్టు




'స్క్విడ్ గేమ్' వెబ్ సిరీస్‌లతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న హాలీవుడ్ నటుడు 'ఓ యోంగ్ సు'కు న్యాయస్థానంలో శిక్ష పడింది. 90 దేశాల్లో నెం.1గా కొనసాగిన ఈ సిరీస్‌కు చాలామంది అభిమానులు ఉన్నారు. నెట్‌ఫ్లిక్స్‌లో తక్కువ సమయంలో ఎక్కువమంది చూసిన వెబ్‌సిరీస్‌గా గుర్తింపు ఉంది. 'స్క్విడ్ గేమ్' సిరీస్‌లో కీలకపాత్రలో కనిపించిన 'ఓ యోంగ్ సు' మీద లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చిన విషయం తెలిసింది. 2017లో వచ్చిన అభియోగాలు నిజమేనని కోర్టు పేర్కొంది. దీంతో 80 ఏళ్ల ఈ నటుడికి దక్షిణ కొరియా కోర్టు ఏడాది జైలు శిక్ష విధించింది. దక్షిణ కొరియాకు చెందిన 'ఓ యోంగ్ సు' కేసు తాజాగా తుది విచారణ జరిగింది. ఈ సందర్భంగా లాయర్లు మాట్లాడుతూ.. నాటక రంగంలో దాదాపు 50 సంవత్సరాలుగా పేరు గడించిన అనుభవజ్ఞుడైన నటుడిగా ఆయన్ను అభివర్ణించారు. కానీ, అతని చర్యలు మాత్రం ఆదర్శవంతంగా లేవని పేర్కొన్నారు. సువాన్ జిల్లా కోర్టు 'ఓ యోంగ్ సు'కు ఏడాదిపాటు జైలు శిక్ష విధించింది. అలాగే సినీ రంగంలో రెండేళ్ల పాటు నిషేధం కూడా విధించింది. గతంలో కూడా ఆయనపై మరో లైంగిక వేధింపుల కేసు కూడా ఉన్నట్లు న్యాయస్థానం దృష్టికి వచ్చింది.

# క్రీడా వార్తలు | SPORTS NEWS

## సీఎస్‌కే కెప్టెన్‌గా ఎంఎస్ ధోని?

ఐపీఎల్ 2025లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న చెన్నైసూపర్ కింగ్స్ మరో కీలక పోరుకు సిద్ధమైంది. ఈ మెగా టోర్నీలో భాగంగా శనివారం(ఏప్రిల్ 5) చెపాక్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. అయితే ఈ మ్యాచ్‌కు సీఎస్‌కేకు గట్టి ఎదురుదెబ్బ తగిలే అవకాశముంది. ఆ జట్టు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ గాయం కారణంగా ఢిల్లీతో మ్యాచ్‌కు దూరమయ్యే అవకాశముంది. గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో గైక్వాడ్ గైక్వాడ్ కుడి మోచేయికి గాయమైంది. దీంతో అతడు అప్పటి నుంచి నెట్ ప్రాక్టీస్‌కు దూరమయ్యాడు. తాజాగా రుతురాజ్ అందుబాటుపై సీఎస్‌కే బ్యాటింగ్ కోచ్ మైఖేల్ హస్సీ సందేహం వ్యక్తం చేశాడు. ఒకవేళ రుతురాజ్ దూరమైతే అతడి స్థానంలో ఎంఎస్ ధోని సీఎస్‌కే కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశముందని హస్సీ తెలిపాడు. "రేపటి మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ ఆడుతాడో లేదో ఇంకా క్లారిటీ లేదు. అతడు ఎంపిక అనేది కోలుకునే దానిపై ఆధారపడి ఉంటుంది. ఇంకా అతడు నొప్పితో బాధపడుతున్నాడు. నెట్స్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. తను ఆడకపోతే, ఎవరు నాయకత్వం వహిస్తారో మేము ఇంకా నిర్ణయించలేదు. కానీ యువ వికెట్ కీపర్ ధోని కచ్చితంగా ముందు వరుసలో ఉంటాడు" అని హస్సీ పేర్కొన్నాడు. కాగా రుతురాజ్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. రాజస్తాన్‌పై ఓటమి పాలైనప్పటికి రుతు 61 పరుగులతో రాణించాడు. కాగా ఇప్పటివరకు ఈ ఏడాది సీజన్‌లో మూడు మ్యాచ్‌లు ఆడిన సీఎస్‌కే కేవలం ఒక్క విజయం మాత్రమే నమోదు చేసింది. చెన్నై ప్రస్తుతం పాయింట్ల పట్టికలో ఎనిమిదో స్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో శనివారం ఢిల్లీతో జరగనున్న మ్యాచ్‌కు సీఎస్‌కే చాలా కీలకం.





## అవేష్ సూపర్ బౌలింగ్

### ఉత్కంఠ పోరులో ముంబై ఓటమి

ఐపీఎల్ 2025లో లక్నో సూపర్ జెయింట్స్ తిరిగి గెలుపు బాట పట్టింది. ఏక్నా స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో ఆఖరి వరకు ఉత్కంఠ భరితంగా సాగిన మ్యాచ్‌లో 12 పరుగుల తేడాతో లక్నో విజయం సాధించింది. 204 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 191 పరుగులకే పరిమితమైంది. ఆఖరి ఓవర్‌లో అవేష్ ఖాన్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ముంబై విజయానికి చివరి ఓవర్‌లో 22 పరుగులు అవసరమయ్యాయి. ఆ ఓవర్‌లో తొలి బంతినే హార్దిక్ పాండ్యా సిక్సర్‌గా మలిచాడు. ఆ తర్వాత అవేష్ ఖాన్ సూపర్ కమ్‌బ్యాక్ ఇచ్చాడు. ఆఖరి 5 బంతుల్లో కేవలం మూడు పరుగులు మాత్రమే అవేష్ ఇచ్చాడు. ముంబై ఇండియన్స్ బ్యాటర్లలో సూర్యకుమార్ యాదవ్(67) టాప్ స్కోరర్‌గా నిలవగా.. నమాన్ ధీర్(46) పరుగులతో పర్వాలేదన్పించాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా(28) ఆఖరిలో పోరాడినప్పటికి తన జట్టును గెలిపించలేకపోయాడు. లక్నో బౌలర్లలో ఆకాష్ దీప్, దిగ్వేష్, శార్ధూల్ ఠాకూర్, అవేష్ ఖాన్ తలా వికెట్ సాధించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ 8 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. లక్నో బ్యాటర్లలో మిచెల్ మార్ష్(31 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లతో 60), మార్‌క్రమ్(53) హాఫ్ సెంచరీలతో మెరవగా.. డేవిడ్ మిల్లర్(27), బదోని(27) రాణించారు. ముంబై బౌలర్లలో హార్ధిక్ పాండ్యా పాటు.. విఘ్నేష్ పుత్తూర్, బౌల్ట్, అశ్వినీ కుమార్ తలా వికెట్ సాధించారు.

## చరిత్ర సృష్టించిన హార్దిక్ పాండ్యా.. తొలి కెప్టెన్‌గా

ఐపీఎల్ 2025లో భాగంగా ఎకానా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. ఈ మ్యాచ్‌లో హార్దిక్ బంతితో మ్యాజిక్ చేశాడు. తన బౌలింగ్‌తో ప్రత్యర్థి బ్యాటర్లను ముప్పు తిప్పలు పెట్టాడు. మిగితా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నప్పటికి హార్దిక్ మాత్రం ఐదు వికెట్లతో చెలరేగాడు. పాండ్యా తన నాలుగు ఓవర్ల కోటాలో 36 పరుగులిచ్చి 5 వికెట్లను పడగొట్టాడు. పాండ్యాకు ఐపీఎల్‌లో ఇది తొలి ఫైవ్ హాల్ వికెట్ కావడం గమానార్హం. ఐపీఎల్‌లో కాదు టీ20ల్లోనే అతడికి మొదటి ఐదు వికెట్ల హాల్. తద్వారా పలు అరుదైన రికార్డులను పాండ్యా తన పేరిట లిఖించుకున్నాడు.

**తొలి కెప్టెన్‌గా..**

ఐపీఎల్‌లో ఫైవ్ వికెట్ల హాల్ సాధించిన తొలి కెప్టెన్‌గా పాండ్యా నిలిచాడు. ఇప్పటివరకు ఈ రికార్డు ఎవరికి సాధ్యం కాలేదు. అదేవిధంగా ఈ క్యాష్‌రిచ్ లీగ్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేసిన కెప్టెన్‌గా హార్దిక్ రికార్డులెక్కాడు. ఇప్పటివరకు ఈ రికార్డు కెప్టెన్‌గా అత్యుత్తమ బౌలింగ్ గణాంకాల రికార్డు అనిల్ కుంబ్లే పేరిట ఉండేది. కుంబ్లే ఐపీఎల్ 2009లో డెక్కన్ ఛార్జర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో



కెప్టెన్‌గా 16 పరుగులిచ్చి 4 వికెట్లు తీసుకున్నాడు. తాజా మ్యాచ్‌తో కుంబ్లే రికార్డును పాండ్యా బ్రేక్ చేశాడు. అంతేకాకుండా ఐపీఎల్‌లో అత్యధిక వికెట్ల సాధించిన రెండో కెప్టెన్‌గా అనిల్ కుంబ్లే రికార్డును పాండ్యా సమం చేశాడు. కుంబ్లే తన ఐపీఎల్ కెరీర్‌లో కెప్టెన్‌గా 30 వికెట్లు పడగొట్టగా.. పాండ్యా ఇప్పటివరకు సారథిగా 30 వికెట్లు సాధించాడు.

**ఐపీఎల్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు చేసిన కెప్టెన్‌లు వీరే..**

5/36 హార్దిక్ పాండ్యా (ముంబై ఇండియన్స్)
4/16 అనిల్ కుంబ్లే (ఆర్సీబీ)
4/16 అనిల్ కుంబ్లే (ఆర్సీబీ)
4/17 JP డుమిని (ఢిల్లీ డేర్‌డేవిల్స్)
4/21 షేన్ వార్న్ (రాజస్తాన్ రాయల్స్)

**ఐపీఎల్ చరిత్రలో అత్యధిక వికెట్లు తీసిన కెప్టెన్లు వీరే:**

57 షేన్ వార్న్, 30 హార్దిక్ పాండ్యా, 30 అనిల్ కుంబ్లే, 25 రవిచంద్రన్ అశ్విన్, 21 పాట్ కమ్మిన్స్

## ముంబైకి భారీ షాక్.. రోహిత్ శర్మకు గాయం

ఐపీఎల్ 2025లో ముంబై ఇండియన్స్‌కు భారీ షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ బ్యాటర్, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ గాయపడ్డాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో మ్యాచ్‌కు ముందు నెట్ ప్రాక్టీస్‌లో రోహిత్ శర్మ మోకాలికి గాయమైంది. దీంతో లక్నో మ్యాచ్‌కు రోహిత్ దూరమయ్యాడు. ఈ విషయాన్ని టాస్ సందర్భంగా ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా వెల్లడించాడు. అదేవిధంగా గాయంతో బాధపడుతున్న జస్ప్రీత్ బుమ్రా త్వరలోనే జట్టులోకి రానున్నట్లు పాండ్యా పేర్కొన్నాడు. ఇక రోహిత్ శర్మ స్థానంలో రాజ్ అంగద్ బావా తుది జట్టులోకి వచ్చాడు. అయితే ఈ సీజన్‌లో రోహిత్ శర్మ తన మార్క్ చూపించలేకపోయాడు. ఈ ఏడాది సీజన్‌లో ఇప్పటివరకు మూడు మ్యాచ్‌లు ఆడిన రోహిత్ కేవలం 21 పరుగులు మాత్రమే చేశాడు.

**తుది జట్లు**

**ముంబై ఇండియన్స్:** విల్ జాక్స్, ర్యాన్ రికెల్టన్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్య (కెప్టెన్), నమన్ ధీర్, రాజ్ బావా, మిచెల్



శాంట్నర్, ట్రెంట్ బౌల్ట్, అశ్వనీ కుమార్, దీపక్ చాహర్, విఘ్నేశ్ పుత్తూర్

**లక్నో సూపర్ జెయింట్స్**

ఐడెన్ మార్క్‌రామ్, మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్, రిషబ్ పంత్ (వికెట్ కీపర్, కెప్టెన్) ఆయూష్ బదోని, డేవిడ్ మిల్లర్, అబ్దుల్ సమద్, శార్దూల్ ఠాకూర్, దిగ్వేష్‌సింగ్ రాఠీ, ఆకాశ్ దీప్, అవేశ్ ఖాన్

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com